# ప్రజాశక్తి

శుక్రవారం 14 జులై 2023 8 పేజీలు




ప్రకాశం



బాపట్ల

పెద్దలు పెళ్లికి ఒప్పుకోలేదని..

## ప్రేమజంట ఆత్మహత్యాయత్నం

- యువతి పరిస్థితి విషమం
- చినగంజాంలో ఘటన

**ప్రజాశక్తి - చీరాల ,బాపట్ల జిల్లా**

పెద్దలు పెళ్లికి అంగీకరించక పోవడంతో ఓ ప్రేమ జంట ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన బాపట్ల జిల్లా చినగంజాం మండలంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం... చీరాల పేరాలకు చెందిన షేక్ మున్నా అనే యువకుడు చినగంజాం సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. పర్చూరు మండలం వీరన్నపాలెంకు చెందిన ప్రవళ్లిక అనే యువతి చినగంజాం మండలం మున్నంవారిపాలెం సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తుంది. ఇద్దరు గత మూడేళ్లుగా ప్రేమిం చుకుంటున్నారు. పెద్దలు వారి పెళ్లికి అంగీకరించక పోవడంతో ఇరువురు హార్పిక్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఇద్దరికి చీరాల వైద్యశాలకు తరలించారు. యువతి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం గుంటూరు వైద్యశాలకు తరలించారు. చీరాల అవుట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## 'కంటి వెలుగు'లో అర్హులకు సర్జరీలు

- డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి
- 15 రోజుల్లో ఆపరేషన్లు

**ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్**

కంటి వెలుగు కార్యక్రమంలో అర్హులైన 6,386 మందికి 15 రోజులలో కాటరాక్ట్ ఆపరేషన్లు చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి వైద్యాధికారులను ఆదేశించారు. డిఎం,హెచ్ఒ ఛాంబర్‌లో డాక్టర్ వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమంపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎం,హెచ్ఒ మాట్లాడుతూ ఇప్పటివరకు పిఎంఒఎలు సర్వే నిర్వహించి కాటరాక్ట్



మాట్లాడుతున్న డిఎం,హెచ్ఒ రాజ్యలక్ష్మి

ఆపరేషన్‌కు 6386 అర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. వారికి 15 రోజులలోగా ఆపరేషన్ చేయాలని ఆదేశించారు. అందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను తయారుచేసి అందరికీ ఆపరేషన్ చేయాలని 2లో

## తెరపైకి ముందస్తు ఊహాగానాలు

- డిశంబరులో ఎన్నికల దిశగా వైసిపి యత్నాలు
- ఫిబ్రవరిలో పెట్టేయోచనలో కేంద్రం
- పార్టీల్లో అలజడి
- పాదయాత్ర రూటునూ తగ్గించిన టిడిపి జాతీయనేత లోకేష్



**ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో**

పార్టీల్లో మళ్లీ ముందస్తు ఎన్నికల అలజడి రేగుతోంది. నాలుగు రోజులుగా ముందస్తు ఎన్నికల వ్యూహాలపైనే చర్చ సాగుతోంది. ఇటీవల దీనిపై పెద్ద ఎత్తున చర్చసాగినా వైసిపి అధిష్టానం ఇప్పట్లో ముందస్తు ఎన్నికలు లేవని ప్రకటన చేసింది. కేంద్రం సానుకూలంగా స్పందించనందునే వైసిపి నేతలు ముందస్తు లేదనే రాగం ఎత్తుకున్నారనే చర్చ అప్పట్లో సాగింది. తాజాగా మళ్లీ ముందస్తుపై ప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం తీవ్రమైంది. కేంద్రం అనుమతిస్తే డిశంబరు లోనే ఎన్నికలకు వెళ్లాలనే యోచనలో వైసిపి ఉన్నట్లు సమాచారం .కేంద్రంపై ఈదిశగా వత్తిళ్లు కూడా తీవ్రతరం చేశారంటున్నారు. అయితే కేంద్రం ఆలోచన వేరుగా ఉందనే ప్రచారం కూడా పార్టీల్లో ఉంది. బిజెపికి కూడా వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. కర్ణాటక ఫలితాల తర్వాత ముందస్తు ఆలోచనలో బిజెపి కూడా ఉన్నట్లు తెలుస్తోంది.అయితే మిగతా రాష్ట్రాల్లో కూడా అసెంబ్లీ ఎన్నికలున్నందున అన్ని కలిపి పిబ్రవరిలో ఎన్నికల పెడితే ఎలా ఉంటుందనే దానిపై బిజెపి అధిష్టానం ఆలోచిస్తోందని పార్టీల్లో చర్చ సాగుతోంది. ఫిబ్రవరి వరకూ ఆగడం కన్నా డిశంబరులోనే ముందస్తుకు వెళితే బాగుంటుందనే భావనలో వైసిపి అధిష్టానం ఉన్నట్లు చెబు తున్నారు. ఏదేమైనా ముందస్తు ఎన్నికలు జరుగుతాయా ?లేదా? అనేదానిపై కేంద్రం తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంది. వైసిపి మాత్రం వీలైనంత మేరకు డిశంబరులో వెళితేనే మేలు జరుగుతుందనే ఆలోచనలో ఉన్నట్లు రాజకీయవర్గాల్లో చర్చ సాగుతోంది. ముఖ్యనేతలు దీనిపైనే వ్యూహ ప్రతివ్యూహాల్లో ఉన్నట్లు సమాచారం. మాజీ మంత్రి బానినేని అమెరికా ప్రయాణం సమయంలోనూ ఇక్కడే ఉండాలని అధిష్టానం పెద్దలు సూచించారని తెలిసింది. ప్రస్తుతం బాలినేని అమెరికాలో ఉన్నారు. రెండ్రోజుల్లో ఆయన జిల్లాకు రానున్నారు. మరోవైపు జిల్లాలో అభ్యర్థిత్వాలపైనా పావులు కదుపుతున్నారు. బలం పుంజుకునేందుకు అవసరమైన మార్పులు చేర్పులు దిశగా వైసిపి అడుగులు వేస్తుంది. ఒంగోలు పార్లమెంటుకు వైవి.తనయుడు విక్రాంత్‌రెడ్డి పేరు తెరపైకి వచ్చింది. దీనిపై ఇప్పటికే పార్టీలో మిశ్రమ స్పందనే వస్తుంది. సిఎం జగన్ ఈ విషయంపై దృష్టి సారించారనే చర్చ ఉంది. ఒంగోలు నుంచి వైవి. తనయుడు పోటీ చేస్తారనే సంకేతాలు కూడా వస్తున్నాయి. అయితే ఈ కుటుంబంతో రాజకీయంగా గత ఎన్నికల నుంచి విభేదిస్తోన్న మాజీ మంత్రి బాలినేని ఇక్కడ మాగుంట శ్రీనివాసులరెడ్డి పోటీ తథ్యమని ప్రకటించారు. ప్రస్తుతం కొన్ని నియోజకవర్గాల్లో ఉన్న అసంతృప్తులు, అభ్యర్థులపై వ్యతిరేకతలు, కొత్తగా వచ్చిన సమీకరణల ఫలితాలను దృష్టిలో పెట్టుకుని పార్టీని బలోపేతం చేయాలనే దిశగా వైసిపి కొత్త ఆలోచనలు చేస్తుందని చెబుతున్నారు. ఎక్కువ మంది అభ్యర్థుల మార్పు ఉంటుందని భావిస్తున్నారు. సీనియర్ నేత బాలినేని ఇటీవలే రెండు సార్లు సిఎం జగన్‌తో భేటీ అయ్యారు. ఆయన ఇచ్చిన నివేదికలు ఏమిటి? అనేదీ చర్చ సాగుతోంది. దర్శి 2లో

అతివేగం.. నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో..

## గాలిలో కలిసిపోతున్న ప్రాణాలు

**రహదారులపై ప్రమాదాలు జరగకుండా అధికారులు అనేక చర్యలు చేపడుతున్నాయి. అయితే వాహన చోదకులు అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతున్నారు. కనీస భద్రతా ప్రమాణాలు కూడా పాటించడం లేదు. మద్యం తాగి వాహనాలను నడపడం, రహదారుల నిర్మాణం లోపభూయిష్టం కారణంగా జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. వందల సంఖ్యలో ప్రయాణికుల ప్రాణాలు గాలిలో కలసిపోతున్నాయి.**

**ప్రజాశక్తి - బాపట్ల జిల్లా**

బాపట్ల జిల్లా పరిధిలో దిగమర్రు-ఒంగోలు 216 జాతీయ రహదారి, చెన్నై- కోల్‌కత్తా 16 జాతీయ రహదారి, నార్కెట్‌పల్లి-అద్దంకి- మేదరమెట్ల నామ్ రహదారులు ఉన్నాయి. ఈ మూడు రహదారులు, జిల్లాలోని అనిన పోలీస్ స్టేషన్ల పరిధిలోని రహదారులపై ప్రతి శనివారమూ పోలీస్ అధికారులు నో యాక్సిడెంట్స్ డే క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు. రహదారి ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నారు. అయినప్పటికీ వివిధ కారణాలతో ప్రమాదాలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి. ప్రధానంగా జాతీయ రహదారులకు అనుసంధానంగాఉన్న సర్వీస్ రోడ్ల జంక్షన్లు వద్ద




రోడ్డు ప్రమాదాలు ఎక్కువ సంఖ్యలో జరుగుతున్నాయి. కొన్ని చోట్ల సర్వీస్ రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో జంక్షన్ల వద్ద రెండు వైపుల నుంచి వేగంగా వస్తున్న వాహనాలు ఢీ కొంటున్నాయి. ముఖ్యమైన జంక్షన్ల వద్ద జాతీయ రహదారిపై అండర్ పాస్‌లు నిర్మించాలన్న ప్రతిపాదనలు అమలుకు నోచలేదు. రహదార్లపై వాహనాల వేగనిరోధం కోసం ఏర్పాటు చేస్తున్న బారికేడ్లు క్రమపద్ధతిలో ఉండడం లేదు. కొన్ని చోట్ల బారికేడ్లు రెండు వైపుల దగ్గరగా ఉంటున్నాయి. దీంతో వాహనాలు మెలికలు తిరిగి వెళ్లాల్సి వస్తుంది. ఇవి కూడా అన్ని చోట్ల లేవు. రహదారిపై 2లో

## తెరపైకి ముందస్తు ఉహాగానాలు

(మొదటి పేజీ తరువాయి)

సంతనూతలపాడు, కొండపి, కనిగిరి ఇలా ప్రతి నియోజకవర్గంలోనూ వర్గపోరు తీవ్రంగా ఉంది. వీటిని అధిగమించేందుకు జిల్లా నేతల ప్లాన్ ఏమిటి? అధిష్టానం వ్యూహం ఏమిటనేదీ చర్చగా మారింది. అధిష్టానం మార్పులను జిల్లా నాయకత్వం ఎలా స్వీకరిస్తుందనేదీ చూడాలి. చాలా మంది అభ్యర్థుల మార్పు ఉంటుందని అధిష్టానం నుంచి సంకేతాలు వస్తున్నాయి. ఎన్నికల సర్వే బృందాల నివేదికలపైనా కసరత్తు సాగుతోంది. ఎవరి పట్ల ఎలాంటి భావన ప్రజల్లో ఉందనే సమాచారం సేకరించి సమీక్షచేస్తున్నారు. ముందస్తుకు కేంద్రం ఓకే చెబితే ఈలోపే అన్ని చక్కదిద్దుకోవాలనే ఆలోచనలో వైసిపి ఉంది. అధిష్టానం చేసే మార్పులను అంగీకరిస్తారా? లేదా?అన్నదీ తేలనుంది. వైసిపి ముందస్తు ఎన్నికల యత్నాలపై మిగతా ప్రధాన రాజకీయపార్టీలు కూడా దృష్టిసారించాయి. కేంద్రం నుంచి సమాచారం కోసం ఆరా తీస్తున్నారు. వైసిపి అయితే డిశంబరులో ఎన్నికలు పెట్టే దిశగా అడుగులు వేస్తుందనే అంచనాల్లో టిడిపి అధిష్టానం ఉంది. జిల్లాల నేతలకు ఇదే సమాచారం ఇచ్చారు. అందుకే టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర దూరాన్ని తగ్గించారు. నియోజక వర్గాలను తగ్గిస్తున్నారు. ప్రస్తుతం ఆయన నెల్లూరు జిల్లాలో ఉన్నారు. 16 లేదా 17న జిల్లాలోకి ప్రవేశిస్తారు. కొండపి, కనిగిరి, మార్కాపురం నియోజకవర్గాల వరకూ రూటు స్పష్టత వచ్చింది. పొదిలి నుంచి ఎటువైపుగా వెళ్లాలనే దానిపై ఇంకా స్పష్టత లేదు. ముందస్తుపై టిడిపి నేతలు కూడా అప్రమత్తంగానే ఉన్నారు. ఎప్పుడు ఎన్నికలు పెట్టినా సిద్ధంగా ఉండాలనే సంకేతాలు అధినేత చంద్రబాబు నుంచి జిల్లా నేతలకు అందాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పార్టీకి ఎక్కువ మంది ఎమ్మెల్యేలు ఉన్నందున ఇక్కడ పార్టీపై చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టిసారించారు.రాయలసీమ జిల్లాల్లో నిర్వహించిన లోకేష్ పాదయాత్రలోనూ ఉమ్మడి ప్రకాశం జిల్లా నేతల పాత్ర కీలకంగా ఉంది. ఎమ్మెల్యేలు అన్ని జిల్లాలకు వెళ్లి లోకేష్‌ను కలిసి ఆయనతో నడిచారు. పాదయాత్రలో టిడిపి ఎమ్మెల్యేలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. జిల్లాలోనూ పాదయాత్రను విజయవంతం చేసేందుకు పావులు కదుపుతున్నారు. జనసేనతో పొత్తుపైనా పార్టీల్లో స్పష్టత వస్తోంది.టిడిపి, జనసేన కలిసి పోటీచేయడం ఖాయమనే చర్చల్లో స్పష్టత వచ్చింది. జిల్లాలో ఒకస్థానం జనసేనకు కేటాయించాల్సి వస్తోందనే ఆలోచనలో టిడిపి నేతలు కూడా ఉన్నారు. దర్శిలో టిడిపి ఇన్‌ఛార్జిని పెట్టలేదు. దీనితో పాటు గిద్దలూరు కూడా జనసేన పరిశీలనలో ఉన్నట్లు చెబుతున్నారు. వైసిపిలో టిక్కెట్లు రావని తెలిసిన నేతలు కొందరు జనసేనపై దృష్టి సారించారు. ఈ పరిణామాలు కూడా రాజకీయ సమీకరణల్లో కొత్త మార్పులకు దారి తీయనున్నాయి. గతంలో విడిగా పోటీచేసినపుడు పార్టీలకు జరిగిన నష్టం..ఇపుడు కలిసి పోటీ చేయడం వల్ల ఓట్లు పరంగా జరిగే లాభాలు, నష్టాలపై పార్టీలు, ముఖ్యనేతలు దృష్టిసారించారు.

## దరఖాస్తులకు ఆహ్వానం

**ప్రజాశక్తి-టంగుటూరు**

మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఖాళీగా ఉన్న 4 వాలంటీర్ల పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపిపి రత్నజ్యోతి తెలిపారు. వాలంటీర్ల ఖాళీల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్‌ను గురువారం విడుదల చేశారు. టంగుటూరు-3 సచివాలయం పరిధిలో ఒక పోస్టును బిసి-ఎ కేటాయించినట్లు తెలిపారు. మల్లవరప్పాడులో ఒక పోస్టు బిసి-డి, సూరారెడ్డిపాలెం, వాసేపల్లిపాడు గ్రామాలలో ఒక్కొక్క పోస్టు ఒసిలకు కేటాయించినట్లు చెప్పారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 16లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 17న దరఖాస్తులను పరిశీలించి, 18వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహి స్తామని చెప్పారు. ఎంపికైన వాలంటీర్లకు ఈ నెల 19న నియామక ఉత్తర్వులు అందజేయనున్నట్లు ఎంపిడిఒ తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## అతివేగం.. నిర్లక్ష్యపు డ్రైవింగ్.. గాలిలో కలిసిపోతున్న ప్రాణాలు

(మొదటిపేజీ తరువాయి)

ఉంచిన ఇనుప బారికేడ్లు, ఇసుకతో నింపిన డ్రమ్ములకు రేడియం స్టిక్కర్లు సక్రమంగా లేకపోవడంతో రాత్రి సమయంలో బారికేడ్లు, డమ్ములు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. చిన్నగంజాం నుంచి రేపల్లె వరకూ నిర్మాణంలో ఉన్న 216 జాతీయ రహదారి 97 కిలోమీటర్ల పొడవున ఉంది. చినగంజాం వద్ద నిర్మించిన రెండు బ్రిడ్జిల నిర్మాణం లోప భూయిష్టంగా ఉంది. ఇక్కడ రహదారి, ఫ్లై ఓవర్ బ్రిడ్జిల అనుసంధానం సక్రమంగా లేదు. బ్రిడ్జి వద్ద రహదారి కుంగడంతో ప్రమాదాలు జరుగుతున్నట్లుగా గుర్తించారు. అయినప్పటికీ చర్యలు తీసుకోలేదు. జాతీయ రహదారులపైనే ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్నట్లుగా అధికారులు గుర్తించారు. ప్రధానంగా అద్దంకి నామ్ రహదారిపై ,చీరాల వద్ద 216 జాతీయ రహదారిపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి.వాడరేవు - పిడుగురాళ్ళ రహదారిలో పర్చూరు, కారంచేడు మధ్యలో రోడ్డు కుంగడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలకు గల కారణాలను శాస్త్రీయంగా గుర్తించి తగిన నివారణ చర్యలు తీసుకోవడంలో అధికార యంత్రాగం వైఫల్యం చెందింది.

జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి జూలై 10 వరకూ జాతీయ రహదారులపై 292 ప్రమాదాలు జరిగాయి. వాటిలో 118 మంది మరణించారు. 330 మంది గాయపడ్డారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కింద జిల్లావ్యాప్తంగా జనవరి నుంచి మే వరకూ 242 కేసులు నమోదు చేసి రూ 8.27 లక్షల జరిమానాలు విధించారు. జిల్లా పరిధిలో పలు చోట్ల బ్లాక్ స్పాట్స్ గుర్తించారు. ఆప్రాంతాల్లోనూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల నిర్వహించిన రహదారుల భద్రతా సమావేశంలో జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా ఈ విషయమై అధికారులను ప్రశ్నించారు. బ్లాక్ స్పాట్స్ వద్ద యుద్ధ ప్రాతిపదికన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఆప్రాంతాలలో వాహనాల వేగ నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. అందుకోసం బారికేడ్లు , స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ మొక్కుబడిగా కాకుండా మరింత విస్తతం చేయాలన్నారు.

**జిల్లాలో రహదారి ప్రమాదాలు ఇలా**
**2023 జనవరి నుంచి జూలై 10 వరకూ**

మొత్తం రహదారి ప్రమాదాలు - 292
గాయపడిన వారు - 330
మరణించినవారు - 118

| రహదారిపేరు | ప్రమాదాల సంఖ్య | మరణాలు | క్షతగాత్రులు |
|---|---|---|---|
| ఎన్‌హెచ్ -16 | 34 | 18 | 36 |
| ఎన్‌హెచ్ - 216 | 45 | 15 | 46 |
| నామ్ జాతీయ రహదారి | 34 | 17 | 26 |

## 'కంటివెలుగు'లో అర్హులకు సర్జరీలు

'మొదటిపేజీ తరువాయి)

సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ (ఎన్‌జిఒ ) భాగస్వామ్యంతో వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసి ప్రజలకు చూపును ప్రసాదించాలన్నారు. జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమములు అమలు పరుస్తూ అంధత్వ నివారణకు కషి చేస్తుందన్నారు. కలెక్టర్ పర్యవేక్షణలో జిల్లాలో అంధత్వ నివారణ సంఘాలను ఏర్పాటు చేసి , ప్రభుత్వ , ప్రైవేట్ స్వంచ్ఛంద సంస్థల సహకారంతో అంధత్వాన్నీ 1.00 నుంచి0. 3% శాతానికి తగ్గించటానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్. డి నళిని, పిఎంఒఒలు, మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

## మౌనికకు అభినందనలు

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

స్థానిక నలంద ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన నూతలపాటి మౌనిక ట్రిపుల్ ఐటి ప్రవేశాలలో అర్హత సాధించింది. ఈ సంధర్భంగా పాఠశాల డైరెక్టర్ మేకల రామకృష్ణారెడ్డి, కరస్పాడెంట్ పద్మజ ఓబుల్‌రెడ్డి, ఉపాధ్యాయులు మౌనికను అభినందించారు.



## అవకాశాలను అందిపుచ్చుకోవాలి : కలెక్టర్

**ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్**

సహకార రంగంలో కొత్త అవకాశాలను సొసైటీలు అందిపుచ్చుకోవాలని కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు. స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో మొట్టమొదటి జిల్లా కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కమిటీ (డిసిడిసి) సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశంలో కొత్త పిఎసిఎస్‌ల ఏర్పాటు, వాటి కంప్యూట రీకరణ, సిఎస్‌ఇలుగా పిఎసిఎస్ఎ ఏర్పాటుపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత 2 సంవత్సరాలుగా సహకార రంగంలో వస్తున్న కొత్త అవ కాశాలను సహకార సంఘాలు అందిపుచ్చు కోవాలన్నారు. మారుతున్న విధివిధానాలకు అనుగుణంగా సహకార సంఘాలు పనితీరు మార్చుకోవాలని దిశానిర్దేశం చేశారు. కొత్త పిఎసిఎస్ఎ ఏర్పాటు, వాటి కంప్యూటరీకరణ, కామన్ సర్వీస్ సెంటర్లుగా పీఎసిఎస్‌లు, జన ఔషధీ కేంద్రాలు, పెట్రోల్ బంక్‌లు, ఎల్పీజీ డిస్ట్రిబ్యూషన్, వంటి వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకొని పిఎసిఎస్‌లు లాభాల బాట పట్టాలని ఆదేశించారు. అన్ని శాఖల మధ్య సమన్వయం చేసుకుంటూ నివేదికలు సమర్పించాలని జిల్లా సహకార అధికారి (డిసిఒ) పి.రాజశేఖర్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జేసీ కె.శ్రీనివాసులు, జిల్లా సహకార అధికారి పొలిశెట్టి రాజశేఖర్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి డాక్టర్ ఎస్.శ్రీనివాస రావు, జిల్లా మత్స్య శాఖ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, పిడిసిసి బ్యాంకు సిఇఒ ప్రకాశ్, పంచాయతీరాజ్ ఎస్ఇ కొండయ్య పాల్గొన్నారు.

## '108'లో ప్రసవం

**వెలిగండ్ల :** మండల పరిధిలోని సూదన గుంట గ్రామానికి చెందిన కె.శ్రావణికి గురువారం పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో కుటుంబ సభ్యులు 108 వాహనం సిబ్బందికి సమాచారం అందించారు. హనుమంతునిపాడు మండలానికి చెందిన 108 వాహన సిబ్బంది సూదనగుంట గ్రామానికి వచ్చి శ్రావణిని కనిగిరి హాస్పిటల్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో పురిటి నొప్పులు ఎక్కువ అయ్యాయి. దీంతో 108 సిబ్బంది వాహనాన్ని నిలుపుదల చేసి శ్రావణికి కాన్పు చేశారు. ఈ సందర్భంగా 108 వాహన సిబ్బంది ఇఎంటి విజయ్, పైలెట్ సాగర్‌కు శ్రావణి కుటుంబ సభ్యులు కతజ్ఞతలు తెలియజేశారు.

## గ్రేస్ ఫౌండేషన్ ఆర్థిక సాయం

**ప్రజాశక్తి-భట్టిప్రోలు**

మండలంలోని పల్లెకోన గ్రామానికి చెందిన కారుమురు సుశీల, వేమూరులో మోపర్తి జ్యోతి ప్రశాంత్‌లు అనారోగ్యంతో మృతి చెందడంతో గ్రేస్ ఫౌండేషన్ అధినేత కైతేపల్లి షాలేంరాజు ఆదేశాల మేరకు సంస్థ సభ్యుడు యాన్నం సురేష్ ఆర్థిక సాయం అందజేశారు. సుశీల కుటుంబానికి రూ.10 వేలు, ప్రశాంత్ కుటుంబానికి రూ.5 వేలు చొప్పున మట్టి ఖర్చుల నిమిత్తం అందజేసినట్లు సురేష్ తెలిపారు. గ్రేస్ ఫౌండేషన్ వేమూరు నియోజకవర్గంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు సురేష్ పేర్కొన్నారు.

# ఖచ్చితమైన ఓటర్ల జాబితా తయారీకి కృషి

**ప్రజాశక్తి-రేపల్లె**

ఎన్నికల నేపథ్యంలో ఖచ్చితమైన ఓటర్ల జాబితాను ప్రకటించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని రెవెన్యూ డివిజన్ అధికారి జగన్నాథం పార్థసారధి అన్నారు. పట్టణంలోని సీతారామ యోగిని కల్యాణ మడపంలో గురువారం సాయంత్రం నియోజకవర్గంలోని నాలుగు మండలాలోని బీఎల్వోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబితాను ఎటువంటి తొప్పొప్పులకు తావివ్వకుండా సరిచేయాల్సిన బాధ్యత బీఎల్వోలపై ఉందని అన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జులై 21వ తేదీ నుంచి ఆగస్ట్ 21వ తేదీ వరకు బీఎల్వోలు ఇంటింటి సర్వే నిర్వహించాలన్నారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించి ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించాలన్నారు. 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు



మాట్లాడుతున్న ఆర్డీవో జగన్నాథం పార్థసారధి

నూతనంగా ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకునేలా చైతన్యపరిచి వారి నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఇంటింటి సర్వేలో ఒకే డోర్‌నంబర్‌లో అధికంగా ఉన్న ఓట్లను గుర్తించి మండల స్థాయి అధికారులకు సమాచారం అందించాలన్నారు. సమావేశంలో నాలుగు మండలాల తహశీల్దార్లు, బూత్‌లెవల్ అధికారులు పాల్గొన్నారు.

## పల్లెకోనలో ఉద్రిక్తత.. టిడిపి నాయకులు అరెస్టు

**ప్రజాశక్తి-భట్టిప్రోలు**

మంగళవారం జరిగిన టిడిపి సంఘీభావ యాత్రలో మాజీమంత్రి నక్కా ఆనందబాబు వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం భట్టిప్రోలు రథం సెంటర్లో వైసిపి నాయకులు చంద్రబాబు, ఆనందబాబుల దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. దీనిని పురస్కరించుకుని గురువారం భట్టిప్రోలులో శాంతియుత నిరసనకు టిడిపి నాయకులు పిలుపునిచ్చారు. దీంతో ఇరు పార్టీల మధ్య ఉద్రిక్త గొడవలు చెలరేగే ప్రమాదం ఉందని పోలీసులు ముందుగానే భట్టిప్రోలుకు పోలీసు బలగాలు దించి ముఖ్య నాయకులను అరెస్టు చేసేందుకు పూనుకోవటంతో కార్యక్రమాన్ని పల్లెకోనకు మార్పు చేశారు. పల్లెకోనలో టిడిపి శ్రేణులు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, మంత్రి నాగార్జున దిష్టిబొమ్మలను దహనం చేశారు. వైసిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి జగన్మోహన్‌రెడ్డి ఖైదీ నంబర్ 6093 అనే ప్లకార్డులను చేతబూని వాటిని కూడా చేశారు. సమాచారం అందుకున్న పోలీస్‌లు పల్లెనలో



టిడిపి నాయకుడు సాయిబాబాను పోలీసులు అరెస్టు చేసి తీసుకెళుతున్న దృశ్యం

ముఖ్య నాయకులైన తూనుగుంట్ల సాయి బాబాతో పాటు మరి కొంతమంది నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. దీంతో మండలంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అరెస్టు చేసిన టిడిపి నాయకులను విడిచి పెట్టాలంటూ పెద్ద ఎత్తున టిడిపి శ్రేణులు పోలీస్ స్టేషన్ వద్ద బైఠాయించి నిరసన చేపట్టారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: మోపిదేవి

**ప్రజాశక్తి-నిజాంపట్నం**

ప్రజా సంక్షేమమే జగనన్న ప్రభుత్వం లక్ష్యమని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. గురువారం నిజాంపట్నం-4 సచివాలయం పరిధిలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంపీ మోపిదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. అలాగే వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను నేరుగా ప్రజల వద్దకు వెళ్లి వివరించడం, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు వారధిగా ఈ కార్యక్రమం ఉందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని సీఎం వైఎస్ జగన్ నూటికి నూరు శాతం నెరవేర్చారని అన్నారు. అన్నివర్గాల ప్రజలు ఆర్థిక స్వావలంబన సాధించే విధంగా సుపరిపాలన సాగిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు మోపిదేవి హరనాథ్‌బాబు, జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, ఎంపీటీసీ నాజర్ ఖాన్, వైస్ ఎంపీపీ ఉన్నవ చంటి, ఎంపీడీవో ఎన్ నాగలక్ష్మి, సర్పంచ్ పోలేరమ్మ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## అనారోగ్యంతో వృద్ధుడి మృతి

**పట్టణ నడిబొడ్డున అనాథ మృతదేహంగా పడిఉన్న వైనం**

**ప్రజాశక్తి-అద్దంకి**



మృతి చెందిన ఏడుకొండలు

మాయమై పోతున్నడమ్మా.. మనిషన్నవాడు.. అన్న కవి మాటకు ఈ సంఘటన నిదర్శనంగా నిలుస్తోంది. గుంజి ఏడుకొండలు(60) అనే వృద్ధుడు అద్దంకి పట్టణ నడిబొడ్డున ఉన్న పురపాలక సంఘం కార్యాలయం వద్ద గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ ప్రాంతంలో నిత్యం వందలాది మంది వారి వారి వ్యక్తిగత పనులపై తిరుగుతూనే ఉంటారు. ఉదయం 10 గంటల సమయంలో ఏడుకొండలు మృతి చెందగా సాయంత్రం నాలుగు గంటల వరకు ఎవరూ పట్టించుకోలేదు. బంధువులు కానీ, అధికారులు గానీ ఆ ప్రాంతానికి రాలేదు. మృతుడు బల్లికురవ మండలం వైదన గ్రామానికి చెందినవాడుగా స్థానికులు గుర్తించారు. ఇతడు చిన్న చిన్న కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడని ఆ ప్రాంతంలోని ప్రజలు తెలిపారు. గత కొద్ది రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలుపుతున్నారు. 4 గంటల సమయంలో వారి బంధువులు వచ్చి మృతదేహాన్ని వైదన గ్రామానికి తరలించారు.

## విద్యుత్ షాక్‌తో రైతు మృతి

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

విద్యుత్ షాక్‌తో రైతు మృతి చెందాడు. ఈ ఘటన పుల్లలచెరువు మండల పరిధిలోని కవలకుంట్ల గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. మృతుడి బంధువుల కథనం ప్రకారం.. కవలకుంట్ల గ్రామానికి చెందిన మద్దుల చిన్న వెంకటరెడ్డి(41) అనే రైతు ఊరు బయట ఉన్న తన దొడ్లో బోరు వేయించుకున్నాడు. అక్కడ నుంచి పైపులైను ఇంట్లోకి వేయించుకున్నాడు. నీళ్లు కావాల్సినప్పుడల్లా దొడ్డి వద్దకు వెళ్లి మోటారు ఆన్ చేసుకునేవాడు. గురువారం ఇంట్లోకి నీళ్లు వదిలేందుకు దొడ్డిలో ఉన్న సింగిల్ ఫేజ్ మోటారును ఆన్ చేసేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## ఐలవరం గ్రామ ఉప సర్పంచిగా కర్రా జయశ్రీ

**ప్రజాశక్తి-భట్టిప్రోలు**

మండలంలోని ఐలవరం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ గా గురువారం 11వ వార్డు సభ్యురాలు కర్రా జయశ్రీ ప్రమాణ స్వీకారం చేశారు. గత రెండేళ్ల క్రితం జరిగిన పంచాయతీ ఎన్నికలలో ఉపసర్పంచ్ పదవి 14వ వార్డు సభ్యుడు పప్పల వెంకటేశ్వరరావు, 11వ వార్డు సభ్యురాలు కర్రా జయశ్రీ మధ్య పోటీ నెలకొనగా మొదటి రెండేళ్లు పప్పల వెంకటేశ్వరరావు, మిగిలిన మూడేళ్లు జయశ్రీ పని చేసేవిధంగా ఆనాడు పెద్దల సమక్షంలో ఒప్పందం కుదిరింది. ఆ మేరకు వెంకటేశ్వర రావు రాజీనామా చేయగా ఎన్నికల అధికారి అదేశాను సారం గురువారం గ్రామ పంచాయతీ పాలకవర్గం ఏకగ్రీవంగా జయశ్రీని ఎన్నుకోగా ఎన్నికల అధికారి, ఈఓపిఆర్‌డి ఊహారాణి పంచాయతీ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, ఎంపిటిసి మురుగుడు శ్రీనివాస రావు, కార్యదర్శి ఎండి జక్రియా, నాయకులు మాచర్ల హేమసుందరవు, జొన్నదుల శరత్, తులసి రంగారావు, గడ్డం శ్రీనివాసరావు, కర్రా కిషోర్, రాజు పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. అలాగే వేమూరు మండలం వరహాపురం గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్‌గా పట్టపు నాగేశ్వరరావు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఇక్కడ కూడా ముందుగా కుదిరిన ఒప్పందం ప్రకారం యలవర్తి సాంబశివరావు రాజీనామా చేయగా నాగేశ్వరరావును ఉప సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

### ఇసుక అక్రమార్కుల నుంచి భూమిని కాపాడాలని

## తహశీల్దారుకు వినతి

**ప్రజాశక్తి-వేటపాలెం**

ఇసుక అక్రమార్కుల నుంచి తన భూమిని కాపాడాలని పందిళ్లపల్లికి చెందిన నరహరి శివకుమార్ గురువారం మండల తహశీల్దారుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ తమ పూర్వీకుల ఆస్తి, తన అనుభవంలో ఉన్న భూమిని ఆక్రమించి ఇసుకను తరలిస్తున్నారని వాపోయారు. మండల పరిధిలోని పుల్లరిపాలెం పంచాయతీ లోగల సర్వే నెంబర్ 102 /6 లోని య.1.50 విస్తీర్ణం గల భూమిని ఆన్‌లైన్ రికార్డులలో అక్రమంగా ఇతరుల పేర్లను ఎక్కించి తన భూమి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్నారు. ఎంతో కాలం నుంచి శ్రమించి మామిడి మొక్కలను పెంచుకొని ఫల సాయంలో ఉన్న మొక్కలను సైతం పెకిలించి వేస్తూ ఇసుక తరలింపు జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సమగ్ర విచారణ చేసి తనకు న్యాయం చేయాలని కోరారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**ప్రజాశక్తి-చీమకుర్తి**



మృతుడు నాగిరెడ్డి వీరరాఘవరెడ్డి

చీమకుర్తిలోని పడమర బైపాస్-రోడ్డులో గురువారం రాత్రి 7గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పొదిలి మండలం కంభాలపాడుకు చెందిన నాగిరెడ్డి వీరరాఘవరెడ్డి(35) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. వీరరాఘవరెడ్డి ఒంగోలు నుంచి పొదిలికి కారులో పులిచెర్ల సుధాకర్‌తో కలిసి ప్రయాణిస్తున్నాడు. చీమకుర్తి బైపాస్ రోడ్డుకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న సుబాబుల్‌లోడు ట్రాక్టర్‌ను తప్పించబోయి ఢీ కొట్టాడు. దీంతో రాఘవరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. సుధాకర్‌కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

**ప్రజాశక్తి-చెరుకుపల్లి**

మండల పరిధిలోని గూడవల్లి ఐటిఐ కళాశాలలో రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జీ హుల్‌దాలాల్ తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరూ ఆగస్టు 1వ తేదీలోగా తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను కళాశాలలో వెరిఫై చేయించుకోవాలని ఆయన తెలిపారు. వెరిఫై చేయించుకున్న అభ్యర్థులకు ఆగస్టు మూడో తేదీన కళాశాలలో అడ్మిషన్లు జరుగుతాయని ఆయన తెలిపారు. ఎలక్ట్రికల్, ఫిట్టర్, మోటర్ మెకానిక్, డ్రాఫ్ట్‌మెన్, సివిల్ మరియు మెకానికల్ డీజిల్ విభాగాలలో 2023-24 సంవత్సరానికి గాను ప్రవేశాలు కోరే విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

## వైసీపీ, జనసేన శ్రేణుల మధ్య వివాదం

**ప్రజాశక్తి-చీరాల**



వాదులాడుకుంటున్న వైసీపీ, జనసేన శ్రేణులు

వైసిపి జనసేన శ్రేణుల మధ్య గురువారం సాయంత్రం మధ్య స్వల్ప వివాదం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఇటీవల వాలంటీర్ల వ్యవస్థను కించపరిచేలా జనసేన అధినేత పవన్ కల్యాణ్ మాట్లాడారు అని అందుకు నిరసనగా బుధవారం సాయంత్రం చీరాల గడియార స్తంభం కూడలిలో కొందరు వాలంటీర్లు, వైసిపి నాయకులు కలసి పవన్ వ్యాఖ్యలను ఖండిస్తూ నిరసనగా ఆయన ఫ్లెక్సీని దహనం చేశారు. ఈ నేపథ్యంలో ఆ మరునాడే చీరాల జనసేన పార్టీ నాయకులు గూడూరు శివరాంప్రసాద్, నాయకులు పలువురు మహిళలు ఫ్లెక్సీని దహనం చేసిన ప్రాంతంలో పసుపునీళ్లు చల్లి పవన్ కల్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్నారు. అదే తరుణంలో సమయంలో జై జగన్ అంటూ కొందరు వైసిపి నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేస్తూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బొమ్మ సమీపంలో వద్ద ఎందుకు ఈ విధంగా చేస్తున్నారని ప్రశ్నించారు. దీంతో ఇరుపార్టీ శ్రేణుల మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుని తోసుకునేంత వరకూ వచ్చింది. విషయం తెలుసుకున్న ఒకటో పట్టణలు పోలీసులు అక్కడకు చేరుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పి పరిస్థితిని అదుపులోకి తీసుకురావడంతో స్థానికులందరూ ఊపిరి పిలుచుకున్నారు.



బస్సు ప్రమాద మృతుల కుటుంబ సభ్యులను డిప్యూటీ సిఎం అంజాద్ బాషా, మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి గురువారం రాత్రి పరామర్శించారు. బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. - **ప్రజాశక్తి-పొదిలి**

## చంద్రయాన్-3 ప్రయోగం దేశానికి గర్వకారణం

**ప్రజాశక్తి-చీరాల:** ఇస్రో శాస్త్రవేత్తలు ప్రపంచ పరిజ్ఞానంతో చంద్రయాన్-3ను రూపొందించారని, ఇది దేశానికే గర్వకారణమని, ప్రతి ఒక్కరూ సైన్స్‌పై అవగాహన కలిగివుండాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కోట వెంకటేశ్వర రెడ్డి అన్నారు. గురువారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చీరాల అంబేద్కర్ సర్కిల్ వద్ద సైన్స్‌పై అవగాహన నిర్వహించారు. చంద్రాయన్-3 విజయవంతమైతే రష్యా, అమెరికా, చైనాల తరువాత భారతదేశం కీర్తి పొందుతుందన్నారు. సాల్మన్ రాజు, అంబటి పుష్పరాజు, సుభాని, రామకృష్ణ, బాలచంద్రుడు, తేజస్విని, తరుణ్, శివనాగేశ్వరి, రేణుశ్రీ పాల్గొన్నారు.

## ఐఐఐటిలో రాయల్ విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి-మార్టూరు రూరల్**




కుడారి యోషిత, దేసు అశ్వని

రాష్ట్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసిన ఐఐఐటి ఫలితాల్లో మార్టూరు రాయల్ హైస్కూల్ విద్యార్థినులు ప్రతిభ చాటారు. పదో తరగతి ఫలితాల్లో మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన మార్టూరుకు చెందిన దేసు అశ్విని, కుడారి యోషితలు శ్రీకాకుళంలోని ఆర్జీయూకేటీలో ప్రవేశాలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా రాయల్ హైస్కూల్ కరస్పాండెంట్ పేరం రవీంద్రబాబు, ఇన్‌ఛార్జి కుడారి మధుబాబు, ప్రధానోపాధ్యాయులు బాలసుబ్రమణ్యం విద్యార్థులను అభినందించారు.

## 'చందలూరు'కు 10 త్రిబుల్ ఐటీ సీట్లు

**ప్రజాశక్తి-పంగులూరు**

మండలంలోని చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరోసారి తన సత్తాను చాటుకుంది. ఈ పాఠశాల విద్యార్థులు ఇప్పుడు 10 సీట్లు సాధించారు. బాపట్ల జిల్లాలోనే 10వ తరగతి ఫలితాల్లో ప్రథమ స్థానం సాధించిన ఈ పాఠశాల, ఇప్పుడు త్రిబుల్ ఐటీలో కూడా తన సత్తాను చాటింది. ఈ 10 సీట్లలో 9 నూజివీడు, ఒకటి ఒంగోలులో వచ్చాయి. విద్యార్థులు ఎన్ మేఘన, బి కావ్య, కే దివ్య సాహితీ, జి సృజన కే శివ తులసి, ఎస్‌కే నజీర్ అహ్మద్ (నూజివీడు) యు బాల అంకమ్మరావు, ఎ పవన్ కుమార్, పి నందకిషోర్‌లు త్రిబుల్ ఐటీ సీట్లు సాధించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చందలూరు గిరిజ, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, చందలూరు గ్రామ పెద్దలు పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## ట్రిపుల్ ఐటికి దుద్దుకూరు హైస్కూలు విద్యార్థులు

**ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్**

ఇంకొల్లు మండలం దుద్దుకూరు ఆచార్య రంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటి ఫలితాల్లో అర్హత సాధించారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించిన పి ప్రేమలత, నూజివీడు ట్రిపుల్ ఐటికి బి వైష్ణవి, షేక్ ఆయేషా, జి అమూల్యలు ఇడుపులపాయ ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని కె ఈశ్వరివాణి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను, వారి తల్లిదండ్రులను గ్రామస్తులు, దుద్దుకూరు గ్రామ వికాస సభ్యులు, ఎన్‌ఆర్‌ఐ రాయిని సుబ్బరామయ్య అభినందించారు.

## పందిళ్లపల్లిలో11 మంది ఎంపిక

**ప్రజాశక్తి-వేటపాలెం**

మండలంలోని పందిళ్లపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన పది మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు గురువారం ప్రధానోపాధ్యాయుడు భట్టిప్రోలు వెంకటేశ్వరరావు తెలిపారు. దంతం విష్ణుప్రియ, పేరిసెట్ల పల్లవి, పృధివి కార్తీక్, సాయి, మోహన్, గుత్తి లీలా వెంకట శ్రావత్, పోలకం దేవీప్రియ నూజివీడు కళాశాలకు, జట్ల కుసుమ, పధివి శ్రీలక్ష్మి, సజన, చల్లా అమత వర్షిణి, వాలి షాలినీ, మాచర్ల భవాని, పూజశ్రీ ఒంగోలు కళాశాలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరిని ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

## 'సంతమాగులూరు'లో ఆరుగురు

**ప్రజాశక్తి-సంతమాగులూరు**

మండలంలో త్రిబుల్ ఐటీకి ఆరుగురు విద్యార్థినులు ఎంపికైనట్లు మండల విద్యాశాఖాధికారి వేమవరపు కోటేశ్వరరావు తెలిపారు. ఏల్చూరు జడ్పీహెచ్ స్కూల్ నుంచి సిహెచ్ నవ్య లక్ష్మి, చవిటి పాలెం జడ్పీహెచ్ స్కూల్ నుంచి బుల్లా సునీత, మక్కెనవారిపాలెం జడ్పీహెచ్ స్కూల్ నుంచి హసీనా, నసీరున్, నూజివీడు త్రిబుల్ ఐటీకి ఎంపికయ్యారు. అలాగే జడ్‌పిహెచ్ మక్కెన వారి పాలెం స్కూల్ నుంచి నవ్యశ్రీ, పూజిత, ఒంగోలు త్రిబుల్ ఐటీకి ఎంపికైనట్లు ఎంఈఓ తెలిపారు. మక్కెనవారిపాలెం జడ్పీహెచ్ స్కూలులో పదో తరగతి చదివిన విద్యార్థినులు నలుగురు త్రిబుల్ ఐటీకి ఎంపికవడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేసి ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేశారు.

## ట్రిపుల్ ఐటికి ఇద్దరు ఎంపిక

**ప్రజాశక్తి-పిట్టలవానిపాలెం**

పదో తరగతిలో మంచి ఉత్తీర్ణత సాధించిన చందోలు నీలి బంగారయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు షేక్ ఖాదిర్, షేక్ జాస్మిన్‌లకు ట్రిపుల్ ఐటిలో సీటు లభించింది. వీరిని మండల ఎంపీడీఓ శేషమాంబ, తహశీల్దారు కవిత, మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు మురళీ ధరరావు అభినందించారు.

# గర్భిణుల్లో రక్తహీనత నివారణకు చర్యలు: కలెక్టర్

**ప్రజాశక్తి-బాపట్ల జిల్లా**



వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్ష జరుపుతున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, చిత్రంలో డిఎంహెచ్‌ఒ విజయమ్మ

గర్భిణుల్లో రక్తహీనత, పోషణలోపం నివారణకు వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా ఆదేశించారు. వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో ఆయన సమావేశం నిర్వహించారు. వైద్యాధికారుల తమ పనితీరు మార్చుకోవాలని కలెక్టర్ హెచ్చరించారు. గర్భిణులు పోషణ లోపంతో బాధపడు తుంటే వైద్యాధికారులు సక్రమంగా పరీక్షలు నిర్వహించక పోవడం ఏమిటని నిలదీశారు. జిల్లాలో 6,920 మంది గర్భిణులు పోషణలోపంతో బాధపడు తుంటే వైద్యులు ఏమి చేస్తున్నారన్నారు. 471 మంది గర్భిణులకు సకాలంలో వైద్య పరీక్షలు చేయకపోవడంపై సంబంధిత వైద్య అధికారులను నిలదీశారు. మీ కుటుంబంలోని వ్యక్తులు గర్భిణులుగా ఉంటే మీరు వైద్య పరీక్షలు చేయించరా... అంటూ వారిని ప్రశ్నించారు. గర్భిణులకు రక్తహీనత పరీక్షలు ప్రతినెల క్రమం తప్పకుండా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంల పనితీరుపై వైద్యాధికారుల పర్యవేక్షణ లోపించిందన్నారు. పరీక్షల నిర్వహణలో నిర్లిప్తంగా వ్యవహరిస్తున్న వైద్యాధికారులకు షోకాజ్ నోటీస్‌లు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.

గ్రామీణ ప్రాంతాలలో ప్రజల ఆరోగ్య పరిస్థితిపై సర్వే సకాలంలో ముగించాలని కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ప్రజల ఆరోగ్య పరిస్థితి బాధ్యత సంబంధిత వైద్యాధికారులదేనని ఆయన స్పష్టం చేశారు. ప్రతినెల వైద్య పరీక్షలపై పర్యవేక్షణ సక్రమంగా ఉండాలని చెప్పారు. ప్రజలకు ఆరోగ్యం అందించడంలో వైద్యాధికారులు కీలకపాత్ర పోషించాలన్నారు. పోషణ లోపం, రక్తహీనత నివారణకు వైద్యాధికారులు సమగ్ర ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల మేరకు అధికారులు పనిచేయాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాలలో వైద్యాధికారులు పరిశీలన తక్కువగా ఉండడంపై ఆరా తీశారు. సచివాలయాల పరిధిలో వైద్య పరీక్షలు పక్కాగా నిర్వహించాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నందున పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల ఆరోగ్య పరిస్థితులను గుర్తించి సకాలంలో వైద్యం అందించాలని ఆయన చెప్పారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని బాపట్ల జిల్లాలో సమర్థంగా నిర్వహించాలన్నారు. వైద్యాధికారులలో సమన్వయం లోపించిందని, లోపాలను సరి చేసుకోవాలని అన్నారు. సాంకేతిక నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేసుకొని వైద్య ఆరోగ్య శాఖలో అమలవుతున్న యాప్‌ల పనితీరుపై పర్యవేక్షణ ఉండాలన్నారు. ఎన్‌సిడిసి స్క్రీనింగ్ సర్వే వేగంగా చేపట్టాలని చేపట్టాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఎస్ విజయమ్మ, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, వైద్యాధికారులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ఐరన్ మాత్రలు మింగిస్తున్న సిబ్బంది

## విద్యార్థులకు ఐరన్ మాత్రలు పంపిణీ

**ప్రజాశక్తి-బల్లికురవ రూరల్**

మండలంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రతి గురువారం ఐరన్ మాత్రలు మింగించాలని గుంటుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్ రమీద్ అహ్మద్ గురువారం అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గుంటుపల్లి కేజీబీవీ పాఠశాలలో వైద్యాధికారి.. సూపర్‌వైజర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 231 మంది విద్యార్థులకు ఐరన్ మాత్రలు మింగించారు. అనంతరం డాక్టర్ రమీజ్ అహ్మద్ మాట్లాడుతూ వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, తద్వారా ఈగలు, దోమలు, ద్వారా వచ్చే వ్యాధులను, అంటువ్యాధులు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఎవరికైనా అనారోగ్యం కలిగితే వెంటనే సంబంధిత వైద్యులను సంప్రదించి అందుకు తగిన మందులను వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ స్కూల్ ప్రిన్సిపల్ సరళ, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, వైద్య అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్‌కు సీసీ కెమెరాలు అందజేత

**ప్రజాశక్తి-వేటపాలెం:** స్థానిక పోలీస్ స్టేషన్‌కు రామన్నపేట ఉప సర్పంచ్ దంతం వెంకట సుబ్బారావు సీసీ కెమెరాలు గురువారం వేటపాలెం ఎస్‌ఐ జి సురేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా చీరాల డిఎస్‌పి ఎస్ ప్రసాద్‌రావు మాట్లాడుతూ సీసీ కెమెరాలు పోలీసుల నేర పరిశోధనలో భాగమైపోయాయన్నారు. ఈ సందర్భంగా సీసీ కెమెరాలు అందజేసిన దాత వెంకట సుబ్బారావును డిఎస్పి కొనియాడారు. ఈ కార్యక్రమంలో చీరాల రూరల్ సీఐ ఏ మల్లికార్జునరావు, సచివాలయ పోలీస్ అంబిక, వైసిపి నాయకులు ఆవుల అశోక్ పాల్గొన్నారు.



సిఐటియు వర్క్‌షాప్ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

## సిఐటియు జిల్లా వర్క్ షాపును జయప్రదం చేయండి

**ప్రజాశక్తి-చీరాల**

బాపట్ల జిల్లా సిఐటియు వర్క్ షాపును ఈ నెల 15,16 తేదీలలో చీరాల మండలం వాడరేవులో నిర్వహిస్తున్నామని, ఈ వర్క్‌షాప్‌ను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్ అన్నారు. జిల్లా వర్క్ షాపు కరపత్రాన్ని ఆవిష్కరణ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొత్తగా ఏర్పడిన బాపట్ల జిల్లాలో కార్మిక ఉద్యమాన్ని ప్రతి మండలంలో బలోపేతం చేయడానికి జిల్లా స్థాయి నాయకత్వానికి జులై 15,16 తేదీలలో చీరాల మండలం వాడరేవులో శిక్షణ ఇవ్వడానికి జిల్లా వర్క్ షాపు జరుపుతున్నట్లు తెలిపారు. ఈ వర్క్‌షాపునకు సిఐటియు రాష్ట్ర నాయకులు కె ఉమామహేశ్వరరావు, కె ధనలక్ష్మి, ముజుఫర్ అహ్మద్ హాజరవుతున్నారని తెలిపారు. కార్మిక ఉద్యమాన్ని బాపట్ల జిల్లాలో బలపరుచుకునేందుకు ఈ వర్క్ షాప్ జరుగుతోందని, కావున ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్ చీరాల మండల కార్యదర్శి ఎం వసంతరావు, నాయకులు ఎం ప్రమీల, లక్ష్మి, సుజాత, చిట్టెమ్మ, మాధవి, సురేష్, ఝాన్సీ రాణి తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాశక్తి-చీరాల**

మలేరియా, డెంగీ వ్యాధుల నివారణకు పట్టలు, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వసతి గృహాల్లో దోమల నివారణకు డీడీటీ మందును పిచికారీ చేస్తున్నట్లు చీరాల సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లా మలేరియా అధికారి జ్ఞానశ్రీ ఆదేశాల మేరకు గురువారం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ వసతి గృహాల్లో డిడిటీ దోమల నివారణ మందును పిచికారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం కావటంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నివారణ చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

# 'జగనన్న సురక్ష'లో చీరాల ప్రథమ స్థానం

**ప్రజాశక్తి-చీరాల**

మండలంలోన గవినివారిపాలెం గ్రామంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఇక్కడ అత్యధికంగా 3,424 మంది లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేయడంతో చీరాల మండలం జిల్లాలోనే మొదటి స్థానం వచ్చింది. జగనన్న సురక్ష ప్రారంభం నాటి నుంచి ఇప్పటివరకు చీరాల రూరల్ పరిధిలో 15,192, అర్బన్ పరిధిలో 7,270 మొత్తం 23,182 మంది ప్రజలకు వివిధ రకాల సర్వీసులు ఉచితంగా అధికారులు అందించారు. తాజాగా గురువారం నాడు గవినివారిపాలెం సచివాలయంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జ్ కరణం



పత్రాలు అందిస్తున్న వైసిపి ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్

వెంకటేష్‌బాబు ఆర్డీవో సరోజిని, ఎంపీడీవో నేతాజీ, తహశీల్దారు ప్రభాకర్‌రావు హాజరయ్యారు. జిల్లాలో 3,424 సర్వీసులు అత్యధికంగా అందించి జిల్లాలో మొదటి స్థానంలో అలాగే రాష్ట్రంలో 6 స్థానంలో తీసుకురావడానికి రెవెన్యూ అధికారులు, వివిధ శాఖల సిబ్బంది తీవ్రంగా కృషి చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు ఉచితంగా వివిధ రకాల సర్వీసులను అందించడానికి పనిచేస్తున్న వాలంటీర్లకు, సచివాలయం సిబ్బందికి అందరికి చీరాల తహశీల్దారు జె ప్రభాకర్‌రావు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. అలాగే భవిష్యత్తులో జరగనున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో కూడా ఇంకా మంచిగా సర్వీసులు అందించేలా సిబ్బంది అంతా టీమ్ వర్క్ చేయాలని, వాలంటీర్లను, సచివాలయం సిబ్బంది అందర్నీ తహశీల్దారు కోరారు.

# కాలువలు ఆక్రమిస్తే చర్యలు : కమిషనర్

**ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్**

మెట్ల నిర్మాణం పేరుతో కాలువలు, పార్కింగ్ ఏర్పాటు పేరుతో రోడ్లను ఆక్రమిస్తే వారికి నోటీసులు ఇచ్చి ఆక్రమణలను తొలగించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా భాగ్యనగర్‌లో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా కొంతమంది డ్రెయినేజీలను ఆక్రమించి మెట్లు నిర్మించడం, మరికొంతమంది రోడ్లపై కార్లు పార్కింగ్ చేయడాన్ని కమిషనర్ గమనించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వెంటనే వారికి నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. కాలువల ఆక్రమణలు తొలగించి మురుగు నీరు సాఫీగా పారేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లు, కాలువలపై భవన నిర్మాణ సామగ్రిని వేస్తే వారిపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. భాగ్యనగర్ ప్రాంతంలో కార్పొరేషన్ స్థలాలను సర్వే చేసి హద్దురాళ్లు ఏర్పాటు చేయాలని సర్వేయర్‌కు సూచించారు. ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ లేకుండా శుభ్రం చేసుకునేలా స్థల యజమానులకు నోటీసులు పంపాలన్నారు. అనంతరం కాలువల్లో పూడిక తీత, చెత్త సేకరణ పనులను పర్యవేక్షించారు. స్థానిక


మురుగు కాలువను పరిశీలిస్తున్న కమిషనర్

ప్రజలతో మాట్లాడి వారికి మూడు బుట్టల విధానంపై అవగాహన కల్పించారు. క్లాప్ యూజర్ ఛార్జీలు వసూలు చేయాలని సిబ్బందికి సూచించారు. కమిషనర్ వెంట వైసిపి నాయకులు పసుపులేటి శ్రీను ఉన్నారు.

**సురక్ష క్యాంపులను జయప్రదం చేయాలి....**

భాగ్యనగర్, వెంగముక్కపాలెం, హౌసింగ్ బోర్డు సచివాలయాల పరిధిలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. కార్యక్రమాన్ని జయప్రదం ఆయన కోరారు. క్యాంపుల నిర్వహణ ఏర్పాట్లను గురువారం ఆయన పరిశీలించారు. జగనన్న సురక్ష కార్యక్రమానికి ముందే ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేయాలన్నారు. మూడు సచివాలయాల పరిధిలో ఒక్క సచివాలయ సిబ్బంది కూడా 90శాతం సర్వే పూర్తి చేయక పోవడాన్ని గుర్తించిన కమిషనర్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంగముక్కపాలెం సచివాలయం పరిధిలో ఓ వాలంటీర్‌ను కమిషనర్ విధుల నుంచి తప్పించారు. సురక్ష క్యాంపులకు రిజిస్టర్ అయిన ప్రజలను తీసుకు వచ్చి క్యాంపులు జయప్రదం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఈదర వెంకట సురేష్ బాబు (చిన్నారి) ఉన్నారు.

**అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

స్థానిక 15వ డివిజన్‌లో 15వ ఆర్థిక సంఘానికి సంబంధించిన రూ.90 లక్షల నిధులతో నిర్మిస్తున్న కాలువలు, కల్వర్టుల నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, ఇంజినీర్ కె మల్యాద్రి, ఎసిపి కె.వెంకటేశ్వర్లు, స్థానిక కార్పొరేటర్ చింతపల్లి గోపి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బూచేపల్లి కమలాకరరెడ్డి వర్ధంతి

**ప్రజాశక్తి-చీమకుర్తి**

వర్ధమాన సినీనటుడు, కీర్తిశేషుడు బూచేపల్లి కమలాకరరెడ్డి వర్ధంతి గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బూచేపల్లి కమలాకరరెడ్డి పార్కులో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి కుటుంబ సభ్యులు, ఎమ్మెల్యే టిజెఆర్.సుధాకరబాబు బూచేపల్లి కమలాకరరెడ్డి స్మృతి వద్ద నివాళులర్పించారు. అనంతరం బూచేపల్లి వెంకాయమ్మ సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మెగా ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాదరెడ్డి, ఎమ్మెల్యే టిజెఆర్. సుధాకరబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధాకరబాబు


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే

మాట్లాడుతూ ప్రతి ఏడాది వేలాది మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తున్న బూచేపల్లి ట్రస్టు సేవలు అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా 2,500 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు.అందులో 974 మందికి ఆపరేషన్లు చేయాలని నిర్ణయించారు. పరీక్షల అనంతరం రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 5 వేల మందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి వేమా శ్రీనివాసరావు, వైసిపి మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, ఎంపిపి యద్దనపూడి శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, వైస్ చైర్మన్ బి.వెంకటరెడ్డి, మాణిక్యం, ప్రముఖ వైద్యులు డాక్టర్ బి.జవహర్, డాక్టర్ వెంకటేశ్వర్లు, వైసిపి నాయకులు చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి, చిన్నపురెడ్డి వెంకటరెడ్డి, కె.శేఖరరెడ్డి, మొగిలిశెట్టి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు భీమన వెంకటరావు, రామబ్రహ్మం, సోమా శేషాద్రి, మన్నం శ్రీధర్, మేదరమెట్ల శ్రీనివాసరావు ,పత్తి కోటేశ్వరరావు, బూచేపల్లి నందిని, నర్రా ధనలక్ష్మి పాల్గొన్నారు.

వెంకటరమణ హాస్పటల్‌లో..

# కార్డియాలజీ సేవలు ప్రారంభం

**ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్**


మాట్లాడుతున్న డాక్టర్ సీతారామయ్య

గత 54 సంవత్సరాలుగా వైద్య రంగంలో విశిష్ట సేవలంది స్తున్న వెంకట రమణ సూపర్ స్పెషాలిటీతో హాస్పటల్‌లో అను రమణ కార్డియాక్ యాలజీ సేవలు ప్రారంభిం చడం ఆనందంగా ఉందని హాస్పటల్ ఎమ్‌డి డాక్టర్ రమేష్ తెలిపారు. వెంకట రమణ హాస్పటల్‌లో అను రమణ కార్డియాలజీ విభాగాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటరమణ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్లు డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, డాక్టర్ కామేపల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ 54 సంవత్సరాలుగా వెంకట రమణ సూపర్ స్పెషాలిటీ ద్వారా వివిధ విభాగాలలో వైద్య సేవలందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పుడు విజయవాడ, వైజాగ్‌లలో సేవలందిస్తున్న అను హాస్పటల్‌తో కలిసి వెంకటరణలో సేవలందించడం ఆనందంగా ఉందన్నారు. కార్డియాలజీ విభాగంలో 7 సంవత్సరాలుగా ప్రకాశం జిల్లా ప్రజలకు అను సేవలందిస్తోందని, ఇకపై వెంకట రమణతో కలిసి సేవలందించడం జరుగుతోందని కార్డియాలజీ డాక్టర్ శ్రీధర్ తెలిపారు. ముందుగా డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, రమాదేవి, డాక్టర్ కామేపల్లి చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యేశ్వరి, డాక్టర్ శ్రీధర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అను వెంకటరమణ కార్డియాలజీ విభాగాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణ హాస్పటల్‌కు చెందిన డాక్టర్లు, నగరంలోని పలువురు డాక్టర్లు పాల్గొన్నారు.

గుంటూరు జిఎస్ఆర్ విద్యాసంస్థల అధినేత

# సాంబశివరావుకు మాతృవియోగం

**ప్రజాశక్తి- నాగులుప్పలపాడు**


గోగినేని సీతమ్మ(ఫైల్)

నాలుగుప్పలపాడు మండలం ఉపుగుండూరు గ్రామానికి చెందిన గుంటూరు జిఎస్ఆర్ విద్యాసంస్థల అధినేత గోగినేని సాంబశివరావుకు మాతృ వియోగం కలిగింది. ఆయన మాతృమూర్తి గోగినేని సీతమ్మ (83) వయోభారం, అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. సీతమ్మకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్దకుమారుడు నాగేశ్వరరావు వ్యసాయం చేస్తున్నాడు. రెండో కుమారుడు సాంబశివరావు గుంటూరులో జిఎస్ఆర్ విద్యా సంస్థలు నిర్వహిస్తున్నారు మూడో కుమారుడు గోగినేని ఆంజనేయులు చాలా కాలంగా నాగులుప్పలపాడు మండల ప్రజాశక్తి విలేకరిగా పని చేస్తున్నాడు. ప్రజాశక్తి సిబ్బంది సీతమ్మ మృత దేహాన్ని సందర్శించి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులను సానుభూతి తెలిపారు. సీతమ్మకు శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## బిఎస్‌రావుకు నివాళి

**ప్రజాశక్తి-శింగరాయకొండ**


నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

చైతన్య విద్యాసంస్థల అధినేత డాక్టర్ బిఎస్.రావు మృతి చెందాడు. శింగరాయకొండ చైతన్య టెక్నో స్కూల్ ప్రిన్సిపల్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో బిఎస్.రావు చిత్రపటానికి గురువారం నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులుపాల్గొన్నారు.

## సిపిఎం రాజకీయ శిక్షణా తరగతులు జయప్రదం చేయండి

**ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్**

సిపిఎం ప్రకాశం జిల్లా రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జివి.కొండారెడ్డి పిలుపునిచ్చారు. క్లాసుల నిర్వహణ కమిటీ సమావేశం సుందరయ్య భవన్‌లో తంబి శ్రీనివాసులు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండారెడ్డి మాట్లాడుతూ సిపిఎం జిల్లా రాజకీయ శిక్షణా తరగతులు ఈనెల 15,16 తేదీల్లో ఒంగోలు సందరయ్య భవన్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ తరగతుల్లో ఎమ్మెల్సీ కె. లక్ష్మణరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.రఘు పాల్గొంటారని తెలిపారు. క్లాసులను జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ క్లాసుల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, సూచనలను కార్యకర్తలకు తెలిపారు. క్లాసులకు హాజరయ్యే ప్రతినిధులందరూ 15వ తేదీ ఉదయం పది గంటలకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఎం నగర కార్యదర్శి జి.రమేష్, నగర నాయకులు ఎస్‌డి. హుస్సేన్, శ్రీరామ శ్రీనివాసరావు, టి. మహేష్, అత్తింటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


అక్కమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

## చాపల అక్కమ్మకు ఘన నివాళి

**ప్రజాశక్తి- కొత్తపట్నం**

మండల పరిధిలోని కె.పల్లెపాలెంలో డాక్టర్ చాపల వంశీకృష్ణ మాతృమూర్తి చాపల అక్కమ్మ దశదిన కర్మ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సంఘాలకు చెందిన నాయకులు అక్కమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్‌కె.మాబు, కంకణాల ఆంజనేయులు, జివి.కొండారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు వి.బాలకోటయ్య,, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెఎఫ్.బాబు, సిపిఎం కొత్తపట్నం మండల కార్యదర్శి సోమిరెడ్డి. నాయకులు పట్టపు ప్రకాశం,కొత్తపట్నం ఎంపిపి అంజిరెడ్డి, టిడిపి నాయకులు ఉన్నారు


పుస్తకాలు అందజేస్తున్న సిఐటియు నాయకులు

## నోటు పుస్తకాల పంపిణీ

**ప్రజాశక్తి-చీమకుర్తి**

మండల పరిధిలోని నిప్పట్లపాడు ఎంపిపి పాఠశాల విద్యార్థులకు సిఐటియు ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు,పలకలు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ ప్రతి ఏడాది ఆనవాయితీగా సిఐటియు కార్యకర్తలు విద్యార్థులకు నోటు పుస్తకాలు, పలకలు అందజేయడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి సిఐటియు చేస్తున్న కృషిని అబినందించారు. విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునంద, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు శీలం ఆదినారాయణ, సిఐటియు నాయకులు నుగ్గుశ్రీను, రాంప్రసాదు,ఎం లక్ష్మయ్య, మహేంద్ర, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# వైద్య సిబ్బంది పనితీరు మెరుగుపడాలి

- రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు
- సబ్ కలెక్టర్ మాధవన్

**ప్రజాశక్తి-మార్కాపురం**

మార్కాపురంలోని ప్రభుత్వ జిల్లా వైద్యశాలను సబ్ కలెక్టర్ సేతు మాధవన్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో సబ్ కలెక్టర్ ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు వెళ్లారు. ఆ సమయంలో కొందరు వైద్యులు, సిబ్బంది విధుల్లో లేకపోవడాన్ని ఆయన గమనించారు. మధ్యాహ్నం కావడంతో భోజనం చేసేందుకు వెళ్లారని చెప్పారు. అనంతరం సబ్‌కలెక్టర్ రోగులతో మాట్లాడారు. వైద్యం సరిగ్గా అందడం లేదని వారు చెప్పారు. ఓ మహిళా రోగి చికిత్స పొందుతోంది. సెలైన్ బాటిల్‌తో బెడ్‌పై ఉంది. ఆమె వాష్‌రూమ్‌కు వెళ్లి వచ్చిన తరువాత సెలైన్ పెట్టాల్సి ఉంది. ఎంత సేపటికీ ఆమెకు సెలైన్ పెట్టే దిక్కు లేకుండా పోయింది. దీంతో అక్కడ విధుల్లో ఉన్న నర్సుపై సబ్ కలెక్టర్ మాధవన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగుల పట్ల ఈ విధంగా వ్యవహరించడం సరికాదని హితవు పలికారు. మరోసారి ఇలాంటి సంఘటన ఎదురైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బారెడ్డి పర్యవేక్షణ లోపించిందని ఆగ్రహించారు. వైద్యులు, సిబ్బంది సక్రమంగా పనిచేయకపోతే చూస్తూ ఊరుకోవడం సరికాదన్నారు. వార్డుల్లో పర్యటించారు. వార్డుల్లో అపరిశుభ్రత ఏమిటని ప్రశ్నించారు. తరచూ తనిఖీలు ఉంటాయని, ఇక మీదట ఇలా ఉండకూడని హెచ్చరించారు. సమయ పాలన, రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం పలు రికార్డులు పరిశీలించారు. వైద్యశాల పనితీరుపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ వైద్యులు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


రికార్డుల పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

## కె.ఉప్పలపాడులో 'గడప గడపకూ'

**ప్రజాశక్తి-కొండపి**

గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు తెలిపారు. మండల పరిధిలోని కె.ఉప్పలపాడు గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు గడప గడపకూ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర నాయకుడు డాకా పిచ్చిరెడ్డి, స్త్రీశిశు సంక్షేమ శాఖ సంఘం ఛైర్మన్, జడ్‌పిటిసి మారెడ్డి అరుణ వెంకటాద్రిరెడ్డి, గ్రామ సర్పంచి, యంపిటిసి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## కంది విత్తనాలు పంపిణీ

**ప్రజాశక్తి-కనిగిరి**

రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని మండల పరిధిలోని ఏరువారిపల్లి గ్రామ సర్పంచి దమ్ము వెంకటయ్య తెలియజేశారు. ఏరువారిపల్లి రైతు భరోసా కేంద్రంలో రాయితీపై రైతులకు శుక్రవారం కంది విత్తనాలు అందజేశారు. చేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిఇఒ ధనలక్ష్మి, వెటర్నరీ అసిస్టెంట్ లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**ప్రజాశక్తి-తర్లుపాడు**

హిందూ శ్మశాన వాటికలో అభివద్ధి పనుల్లో భాగంగా గది నిర్మాణం, బోరు ఏర్పాటుకు ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు కశెట్టి జగన్‌బాబు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య పెద్దలు జవ్వాజి భాస్కరరావు, గాదంశెట్టి శేషగిరి, దోగిపర్తి మల్లికార్జునరావు, పోలేపల్లి జనార్ధన్‌రావు, జవ్వాజి వెంకటేశ్వర్లు, జవ్వాజి జనార్ధన్‌రావు, నేరెళ్ల కష్ణ, సూరె ఆంజనేయులు, చినమనగొండ సుబ్రహ్మణ్యం, నేరెళ్ల సుబ్బారావు, చక్కా చెన్నయ్య, వాగిచర్ల మురళీకష్ణ, నేరెళ్ల జనార్ధన్‌రావు, గర్రె మురళి, చక్కా బాలరంగం, దోగిపర్తి హరిబాబు, బల్లాని కష్ణ, సూరె పవన్‌కుమార్, మంచికంటి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## 38 పొగాకు బేళ్లు తిరస్కరణ

**టంగుటూరు:** .కొండపి రోడ్డులోని పొగాకు వేలం కేంద్రానికి మండల పరిధిలోని జమ్ముల పాలెం, తూమాడు గ్రామాల రైతులు 779 పొగాకు బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 741 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 38 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.245, అత్యల్ప ధర రూ.160, సరాసరి ధర 227.33పైసలు పలికింది.

## రేణుకకు ట్రిపుల్ ఐటి సీటు

**రాచర్ల:** రాచర్లలోని స్పందన హైస్కూల్ విద్యార్థిని గువ్వా రేణుక ట్రిపుల్ ఐటిలో సీటు సాధించింది. రేణుక మెరిట్ లిస్టులో సీటు సాధించి నూజివీడు ట్రిపుల్ ఐటి క్యాంపస్ సీటుకు ఎంపికైనట్లు స్పందన విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ పేర్ల సుధీర్ కుమార్ రెడ్డి తెలిపారు. ట్రిపుల్ ఐటిలో సీటు సాధించిన రేణుకను పలువురు అభినందించారు.

## నిరుపయోగంగా ఆర్‌ఒ ప్లాంట్

**యర్రగొండపాలెం :** యర్రగొండపాలెంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో రోగుల అవసరాల రీత్యా రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ గత ఏడాది ఆయన సొంత నిధులతో ఆర్‌ఒ ప్లాంటు ఏర్పాటు చేశారు. కొంత కాలం పాటు ఆ ప్లాంట్ రోగులకు ఉపయోగ పడింది. తర్వాత మరమ్మతులకు గురైంది. దాని గురించి ఎవరూ పట్టించుకోక పోవడం నిరుపయోగంగా మారింది. ప్రభుత్వ వైద్యశాలకు ప్రతిరోజూ 300 మంది రోగులు, వారి సహాయకులు వచ్చిపోతుంటారు. మంచినీటి సౌకర్యం లేకపోవడంతో వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బంకుల వద్ద వెళ్లి డబ్బులు చెల్లించి నీళ్లు తాగాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆర్‌ఒ ప్లాంట్‌కు మరమ్మతులు చేయించి మంచినీటి సౌకర్యం కల్పించాలని రోగులు కోరుతున్నారు.

## ఆరుబయటే స్నానం

- హాస్టల్ విద్యార్థుల ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

యర్రగొండపాలెం పట్టణంలో 565 జాతీయ రహదారికి ఆనుకొని మార్కాపురం రోడ్డులో ప్రభుత్వ బాలుర ఎస్‌సి-1 బాలుర వసతి గృహం ఉంది.ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడో పాతికేళ్ల నాడు నిర్మించిన భవనం కావడంతో మరమ్మతులకు గురైంది. వర్షం వస్తే భవనమంతా కారుతుంది. ఇటీవలనే రెండు నెలల క్రితం కురిసిన వర్షాలకు స్నానాల గదికి ఆనుకొని ఉన్న ప్రహరీ పడిపోయింది. ఇప్పటి వరకు దాన్ని నిర్మించలేదు. వసతి గృహంలో 130 మంది ఉన్నారు. వారంతా స్నానాలు చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వసతి గృహం ప్రక్కనే జాతీయ రహదారి ఉంది. దీంతో వాహనాలు, జనాలతో రద్దీగా ఉంటుంది. ఫలితంగా ఆరు బయట స్నానం చేసేందుకు విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. తరచూ విద్యుత్ సమస్య తలెత్తుంది. దీంతో రాత్రి పూట భోజనం చేసేందుకు విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. అధికారులు వెంటనే ప్రహరి నిర్మించి, విద్యుత్ సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.


ఆరుబయట స్నానం చేస్తున్న విద్యార్థులు

## మొక్కుబడిగా మండల సర్వ సభ్య సమావేశం

**ప్రజాశక్తి -కురిచేడు**

మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బెల్లం కోటేశ్వరమ్మ అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా సమీక్షించారు. అయితే ప్రజా ప్రతినిధులు తతమ గ్రామాల్లోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ప్రస్తావనే తీసుకురాలేదు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. వివిధ కారణాలతో ప్రజలు ఎక్కువ శాతం మంది రోగాల బారిన పడుతున్నారు. సివిల్ సప్లయ్ ద్వారా రేషన్ బియ్యం, కందిపప్పు సక్రమంగా సరఫరా చేయడం లేదు. ఈ సమస్యలపై ప్రజాప్రతినిధులు గళమెత్తలేదు. సమావేశానికి వెళ్లామా వచ్చా అనే రీతిలో ప్రవర్తించారు. జడ్‌పిటిసి నుసుం వెంకట నాగిరెడ్డి మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసికట్టుగా పనిచేస్తే సవ స్యలను పరిష్కరించవచ్చునని తెలిపారు. ఆదిశగా అందరూ కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ వసంతరావు నాయక్, తహశీల్దారు జ్వాలా నరసింహం, వివిధ శాఖల అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారులు

## ఉపాధ్యాయుడికి సన్మానం

**ప్రజాశక్తి-పిసిపల్లి**

దివాకరపురం ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తూ ఇతర ప్రాంతానికి బదిలీపై వెళ్లిన వెంకటేశ్వర్లును గ్రామస్తులు గురువారం సన్మానించారు. అనంతరం ఉపాధ్యాయుడు పాఠశాలకు రూ.5వేలు విలువైన సౌండ్ సిస్టం అందజేశారు. అదేవిధంగా ఉపాధ్యాయులు కోటపాటి తిరుపతయ్య, చీమలమర్రి సుబ్రహ్మణ్యం రూ.5వేల నోటుపుస్తకాలను, పలకలు విద్యార్థులకు అందించారు. పాఠశాల అభివృద్ధికి సహకారం అందించిన ఉపాధ్యాయులను గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-1 సంజీవ్, ఎంఇఒ-2 ఆర్.శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిహెచ్.అరుణ, ఉపాధ్యాయురాలు శ్రీవేణి, గ్రామస్తులు సుదర్శన్, స్వర్ణ రమణయ్య పాల్గొన్నారు.

## థామస్ మృతి తీరనిలోటు

**మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి**

**ప్రజాశక్తి-కొనకనమిట్ల**

కొనకనమిట్ల మండలం వాగుమడుగు పంచాయతీ పరిధిలోని బోడపాడు గ్రామానికి చెందిన వైసిపి ఎస్‌సిసెల్ కన్వీనర్ బుదాల థామస్(50) బుధవారం రాత్రి మృతిచెందాడు. ఆయన మృతదేహాన్ని కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాస్‌రెడ్డి గురువారం సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఉడుముల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ థామస్ అకాల మృతి పార్టీకి తీరని లోటని చెప్పారు. థామస్ పార్టీకి విధేయుడుగా ఉంటూ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ మంచి పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. థామస్ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. థామస్‌కు నివాళు లర్పించిన వారిలో ఎంపిపి మోరబోయిన మురళీకష్ణ, రేగడపల్లి సొసైటీ అధ్యక్షుడు కామసాని వెంకటేశ్వర్‌రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ సురవరపు పెద్దవెంకటరెడ్డి, వాగుమడుగు, గనివెనపాడు సర్పంచులు భూదాల జోసెఫ్, కమలాకర్‌రావు, లక్ష్మీవెంకటేశ్వర్లు, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు చిరుగూరి కోటేశ్వరరావు, మాజీ ఎంపిటిసి ఎం.చిన్నకోటేశ్వరరావు, నాయకులు పందిటి ఏసేబు, కదమ ప్రసాద్, బొరిగర్ల బాలయ్య, బూదాల ఆంథోనిబాబు, ముత్యాల కాశయ్య, జిల్లెల్ల కస్తూరెడ్డి, పాతకోట శ్రీనివాసులరెడ్డి, అంజిరెడ్డి ఉన్నారు.


నివాళులర్పిస్తున్న నాయకులు

## హాస్టల్ విద్యార్థులను ఆదుకోవటంలో ఘోర వైఫల్యం

**బీసీ వెల్ఫేర్ ఆఫీసర్‌కి ఎస్ఎఫ్ఐ వినతి**

**ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్**

హాస్టల్ విద్యార్థులను ఆదుకోవటంలో అధికారులు ఘోరంగా వైఫల్యం చెందారని, హాస్టల్స్‌లో మెనూ సక్రమంగా అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్ డిమాండ్ చేశారు. రాచర్ల మండలం యడవల్లి బిసి బాలుర హాస్టల్ వార్డెన్ సక్రమంగా రావట్లేదని, ఈ విషయమై విచారణ జరిపించాలని కోరుతూ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ అంజకు ఎస్ఎఫ్ఐ నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిహెచ్ వినోద్ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ అధ్యయన యాత్ర సందర్భంగా గిద్దలూరు నియోజకవర్గం రాచర్ల మండలం యడవల్లి గ్రామంలోని బిసి బాలుర హాస్టల్ ను సందర్శించగా అక్కడ వార్డెన్ గా విధులు నిర్వహిస్తున్న వహీదా సరిగ్గా హాస్టల్ కు హాజరు కావడం లేదన్నారు. విద్యార్థులకు ఇచ్చే మెనూ సైతం అమలు చేయడం లేదని విద్యార్థులు తమ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారన్నారు. మంగళవారం ఇడ్లీ, చట్నీ పెట్టాల్సి ఉండగా అన్నం, నీళ్ల చట్నీ పెట్టారన్నారు. ఏబిఎస్ రోజువారి పరిశీలన లోపం కారణంగానే ఇదంతా జరుగుతుందని జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఒంగోలు నగర అధ్యక్ష కార్యదర్శులు శశాంత్, హేమంత్, నాయకులు వెంకటేష్, వీరాస్వామి పాల్గొన్నారు.

# జీతాలు రాక విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల ఇక్కట్లు

**ప్రజాశక్తి-బాపట్ల జిల్లా**

జిల్లాలోని చీరాల డివిజన్ పరిధిలో పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు, షిఫ్ట్ ఆపరేటర్లు, వాచ్‌మెన్‌లు జీతాలు రాక ఇక్కట్లు పడుతున్నారు. చీరాల డివిజన్ పరిధిలో వివిధ సబ్ స్టేషన్‌లలో కొన్ని సంవత్సరాలుగా కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి కాంట్రాక్టర్ ద్వారానే జీతాలు చెల్లింపులు జరుపుతారు. అయితే విద్యుత్ శాఖ కాంట్రాక్టర్ల మధ్య నెలకొన్న విభేదాల కారణంగా 10 నెలల జీతాలు నిలిచిపోవడంతో కార్మికులు తమ కుటుంబ జీవనం కష్టమై ఇబ్బందులు పడుతున్నారు. వీరికి 2021లో రెండు నెలలు, 2022లో రెండు నెలలు, 2023లో జనవరి నుంచి జీతాలు నిలిచిపోయాయి. అలానే కాంట్రాక్టర్ 2022 సెప్టెంబరు నెల నుంచి సదరు కాంట్రాక్ట్ కార్మికుల ఇపిఎఫ్ మొత్తాన్ని కూడా జమ చేయకపోవడంతో వారు సర్వీస్‌పరంగా కూడా నష్టపోతున్నారు. విద్యుత్ శాఖలో ఒక కాంట్రాక్టరుతో అధికారులు అగ్రిమెంట్ చేసుకోగా అంతకు ముందు ఉన్న కాంట్రాక్టర్ కోర్టుకు వెళ్లారు. విచారణ జరిపిన కోర్టు తీర్పును రిజర్వు చేసింది. విద్యుత్ అధికారులు కూడా ఎలాంటి నిర్ణయం తీసుకోనందున చీరాల డివిజన్ లోని అడుసుమల్లి, చెరుకూరు, కారంచేడు, స్వర్ణ, ఇడుపులపాడు, పెదగంజాం, మోటుపల్లి 33/11కెవి సబ్‌స్టేషన్‌లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల జీతాలు నిలిచిపోయాయి. అయినప్పటికీ కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తూనే వచ్చారు. అయితే విద్యుత్ శాఖ అధికారులు ఒక అఫిడవిట్ తయారు చేసి దానిపై సంతకాలు కోరుతున్నారు. తమకు జీతాలు సక్రమంగా రాకపోయినా ఇష్టపూర్వకంగానే పనిచేస్తున్నట్లు, కోర్టు, విద్యుత్ అధికారుల సూచనలకు అనుగుణంగా నడుచుకుంటామని, అతిక్రమించినట్లయితే అధికారులు తీసుకునే చర్యలకు బాధ్యత వహిస్తామని ఇందులో ఉంది. ఇలాంటి అఫిడవిట్‌ల వలన తమ భవిష్యత్ అగమ్యగోచరం అవుతుందని కాంట్రాక్ట్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జీతాలు లేక ఇబ్బందులు పడుతున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు, షిఫ్ట్ ఆపరేటర్లు, వాచ్‌మెన్‌లు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషాను కలిసి తమ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. 10 నెలల జీతాలు రాక విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సమస్యను తక్షణమే పరిష్కరించి వారి కుటుంబాలను ఆదుకోవాలని జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్ కోరారు.



పేదలకు అన్నదానం నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ పొగడదండ రవికుమార్

## రవి యూత్ ఆధ్వర్యంలో అన్నదానం

**ప్రజాశక్తి-వేటపాలెం**

యువగళం పాదయాత్ర 2వేల కిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా రవి యూత్ ఆధ్వర్యంలో గురువారం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మండల పరిధిలోని రామన్నపేట పంచాయతీ వినాయకనగర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పరిసర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా చీరాల ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి రవికుమార్ మాట్లాడుతూ యువతకు రాజకీయాలలో ప్రాతినిధ్యం కల్పించి మంచివారికి, నిజాయితీపరులకు పదవులు ఇచ్చి రాజకీయాలను సమూలంగా మార్చేందుకు లోకేష్ యువగళం పేరుతో పాదయాత్ర చేపట్టారన్నారు. ఇప్పటికే 2 వేల కిలోమీటర్లు దిగ్విజయంగా పూర్తి చేసి ప్రజల మన్ననలు పొందారన్నారు. ఒక్కరోజు కూడా విశ్రాంతి లేకుండా ఈ మైలురాయిని అధిగమించటం గొప్ప విషయమని కొనియాడారు. తెలుగుదేశం పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోలో మహిళలకు అగ్రతాంబూలం ఇచ్చినట్లు తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళలకు నెలకు రూ.1500, ప్రతి బిడ్డ చదువుకి సంవత్సరానికి రూ.15,000, సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వటం, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి హామీలు మహిళా సాధికారికతకు దోహదపడతాయన్నారు. అదేవిధంగా నిరుద్యోగులకు నెలకు 3,000 రూపాయలు ఇవ్వటం వలన వారు ఎటువంటి ఒత్తిడి లేకుండా ఉద్యోగాన్వేషణ చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. రైతుకు 20 వేల రూపాయలు కేటాయించటం, రైతులు సాగు సన్నద్ధతకు అప్పులు చేయకుండా ఉండటానికి దోహదపడుతుందన్నారు. బీసీలకు రక్షణ చట్టం ద్వారా ఆయా వర్గాల పేదలకు రక్షణ కలుగుతుందని అన్నారు. ప్రజలు ఆలోచన చేయాలని, మంచివారిని ఎన్నుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రవి యూత్ సభ్యులు శ్రీకాంత్, వెంకటేశ్వర్లు, చిన్న, వేణు, తదితరులు పాల్గొన్నారు.

## రామకూరు విద్యార్థినులకు ట్రిబుల్ ఐటీ సీట్లు

**ప్రజాశక్తి-పంగులూరు**

పంగులూరు మండలంలోని మారుమూల గ్రామమైన రామకూరు గ్రామానికి చెందిన ఆరుగురు విద్యార్థినులకు, నూజివీడు ట్రిబుల్ ఐటీలో సీట్లు వచ్చాయి. ప్రభుత్వం గత విద్యా సంవత్సరం 10వ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచి, మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు గురువారం ట్రిబుల్ ఐటీ సీట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. వీరిలో పోలిశెట్టి సుప్రజ, మానం యశస్విని, మానం పూజిత, మిన్నేకంటి రమ్యశ్రీ, మిన్నేకంటి పూజశ్రీ, పాలపర్తి పల్లవి ఉన్నారు. చిన్న గ్రామమైన రామకూరుకు చెందిన ఆరుగురు విద్యార్థినులు నూజివీడులో సీట్లు సాధించడం పట్ల గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఒకే గ్రామం నుంచి ఆరుగురు విద్యార్థులు సీట్లు సాధించటం, అందులోనూ అందరికీ నూజివీడు ట్రిబుల్ ఐటీలోనే సీట్లు రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ కుటుంబాల నుంచి వచ్చి కష్టపడి చదివి మంచి మార్కులతో ట్రిబుల్ ఐటీ సీట్లు సాధించిన విద్యార్థినులను ఆదర్శంగా తీసుకొని, విద్యార్థులు చదవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ ఆరుగురు విద్యార్థినులు మార్టూరు మండలం వలపర్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివారు.

**పంగులూరులో ముగ్గురికి..**

మండల కేంద్రమైన పంగులూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన ముగ్గురు విద్యార్థులకు ట్రిబుల్ ఐటీ సీట్లు వచ్చినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కొప్పోలు రమాదేవి తెలిపారు. వీరిలో వడ్లమూడి నాగస్వాతి, షేక్ నసీమాకు నూజివీడు ట్రిబుల్ ఐటీలోనూ, తెడ్ల వెంకటసాయి, తరుణ్ తేజకు శ్రీకాకుళం ట్రిబుల్ ఐటీలో సీటు వచ్చినట్లు రమాదేవి తెలిపారు.

## జగనన్న సురక్ష సర్టిఫికెట్ల పంపిణీ

**ప్రజాశక్తి-నగరం**



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపిపి చింతల శ్రీకృష్ణయ్య

మండల పరిధిలోని ఏలేటిపాలెం, సిరిపూడి గ్రామ సచివాలయాల వద్ద నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో స్థానిక ఎంపిపి చింతల శ్రీకృష్ణయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 500 అన్ని రకాల సర్టిఫికెట్‌లు అందించినట్లు తెలిపారు. పార్టీలతో సంబంధం లేకుండా, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. గడిచిన 4సంవత్సరాల కాలంలో ఈసిరిపూడి గ్రామంలో రూ.9 కోట్ల విలువైన వివిధ రకాల పథకాలు ద్వారా అందించినట్లు తెలిపారు.



బాధిత గిరిజనులను పరామర్శిస్తున్న తులసి కుమారి

**గిరిజనుల గుడిసెలను తొలగింపు..**

## పాలకుల స్వార్థం కోసమే: జనసేన

**ప్రజాశక్తి-బాపట్ల**

పాలకుల ప్రయోజనాలకే సూర్యలంక సముద్ర తీరంలో గత మంగళవారం రాత్రి గిరిజనుల పూరి గుడిసెలను తొలగించడం అన్యాయమని జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి గుంటుపల్లి తులసి కుమారి విమర్శించారు. గురువారం బాపట్ల మండలం అడవి గ్రామపంచాయతీ పరిధిలోని సూర్యలంక బీచ్ వద్ద తొలగించిన గిరిజన గుడిసెలను సందర్శించి నిర్వాసితులకు ఆహార పొట్లాలను అందజేశారు. ఈ సందర్భంగా తులసి కుమారి మాట్లాడుతూ సూర్యలంక బీచ్ వద్ద నివాసం ఉంటున్న గిరిజనుల ఇళ్లు తొలగించడం వెనుక రాజకీయ కుట్రకోణం ఉందని అన్నారు. గత కొన్నేళ్ల నుంచి ఈ ప్రాంతంలో గిరిజనులు సరైన వసతులు లేకుండా చిన్న గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారని అన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ప్రాంతానికి చెందిన కొందరు వైసిపి నాయకులు ఈ స్థలాలపై కన్నేసి టూరిజం పేరుతో ఆ స్థలాన్ని ఆక్రమించుకోవాలనే దురుద్దేశంతో గుడిసెలను కూల్చివేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దలను ప్రశ్నించలేని ఈ నాయకులు పేద గిరిజనులపై ప్రతాపం చూపడం వెనుక రాజకీయ నాయకుడి హస్తం ఉందని అన్నారు. పేద గిరిజనులకు కనీస వసతులు కల్పించకుండా, ముందస్తు సమాచారం లేకుండా గుడిసెలను తొలగించడం ఏమిటని ప్రశ్నించారు. నివాసాలు కోల్పోయిన గిరిజనులు ఎక్కడికి వెళ్లాలో తెలియక దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి వీరికి కావాల్సిన ఆధార్ కార్డు, రేషన్‌కార్డులు అందించి వీరికి ప్రత్యామ్నాయంగా నివేశన స్థలాలను కేటాయించి, గృహ నిర్మాణాలకు సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ఇందుకు బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి చొరవ చూపాలని తులసి కుమారి కోరారు. సూర్యలంకలో గిరిజన నిర్వాసిత ప్రాంతాన్ని సందర్శించిన వారిలో కార్యక్రమంలో కర్లపాలెం మండల అధ్యక్షులు గొట్టిపాటి శ్రీకృష్ణ, ఉపాధ్యక్షులు సురేంద్రబాబు, అంజనేష్, మహేష్, గోగన ఆదిశేషు, అజయ్, బాలాజీ, రాంబాబు, రాధాకృష్ణ అంకమ్మరావు, శారబంది పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

## ధ్రువ పత్రాల పంపిణీ

**ప్రజాశక్తి-కొల్లూరు**

జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా కొల్లూరు మండలం రావికంపాడు గ్రామంలో గురువారం 11 రకాల ధ్రువీకరణ పత్రాలను స్పెషల్ ఆఫీసర్ రమణ అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఈ అవకాశాన్ని అర్హత కలిగిన లబ్ధిదారులందరూ వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు ఏ శ్రీనివాసరావు, సర్పంచ్ గుమ్మడి సీతారావమ్మ, ఈవోపీఆర్‌డి సిహెచ్ రవిబాబు, సెక్రటరీ మణిరాజు, మాజీ ఎంపీపీ పద్మారావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేస్తున్న రోటరీ అధ్యక్షులు మురళీకృష్ణ

## రోటరీ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం

**ప్రజాశక్తి-అద్దంకి**

రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ ఆధ్వర్యంలో గురువారం స్థానిక మెయిన్ రోడ్డు అధ్యక్షులు చిన్ని మురళీకృష్ణ కార్యాలయంలో బత్తుల శ్రావణి అనే పేద విద్యార్థినికి రూ.4 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు చిన్ని మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు రోటరీ ద్వారా కల్పించడం గతంలో కూడా జరిగిందని, భవిష్యత్తులో కూడా తనవంతు సహాయ సహకారాలు రోటరీ ద్వారా జరుగుతాయని అన్నారు. సభ్యుల సహకారంతో మరిన్ని కార్యక్రమాలు జరిపేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ చప్పిడి వీరయ్య, ట్రెజరర్ కొల్లా భువనేశ్వరి, రోటరీ సభ్యులు జాగర్లమూడి శివ కుమారి, అద్దంకి లెవి ప్రసాద్, నర్రా శ్రీలక్ష్మి, షేక్ మహమ్మద్ రఫీ, సంకా బాబు తదితరులు పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటికి ఇద్దరు విద్యార్థులు ఎంపిక

**ప్రజాశక్తి-నగరం**





మండల పరిధిలోని ఉల్లిపాలెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు నూజివీడు ట్రిపుల్ ఐటికి ఎంపికయ్యారని మండల విద్యాశాఖ అధికారి కె హరిబాబు గురువారం తెలియజేశారు. ఈ సందర్భంగా వారిని ఎంఈవో హరిబాబు, పాఠశాల ఉపాధ్యాయులు, పలువురు ప్రత్యేకంగా అభినందించారు. జీవితంలో మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.

## 15న వాహనాల వేలం

**ప్రజాశక్తి-నగరం**



వేలానికి సిద్ధంగా ఉన్న వాహనాలు

వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈ నెల 15వ తేదీన శనివారం నగరంలోని స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌లో బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు నగరం సెబ్ సీఐ దేవర శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలం పాటలో 18 ద్విచక్ర వాహనాలు, 1 ఆటో ఉంటాయన్నారు. ఆసక్తి గలవారు ఈ వేలం పాటలో పాల్గొని తమకు నచ్చిన వాహనాన్ని పొందవచ్చని ఆయన తెలియజేశారు.

# మట్టి తవ్వకాలు నిలుపుదల చేయాలి

## తహశీల్దారుకు గ్రామస్తుల వినతి



తహశీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

**ప్రజాశక్తి-దర్శి**

దర్శిమండలం వెంకటాచలం పంచాయతీ పరిధిలోని అబ్బాయిపాలెం గ్రామ సర్వే నెంబరు 258లో సుమారు 330 ఎకరాల్లో కొండ ఉంది. పూర్వకాలం నుంచి అబ్బాయి పాలెం గ్రామస్తులు తమ పశువులు, మేకలు, గొర్రెలను కొండపై మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే కురిచేడు మండలం బోదనంపాడు గ్రామానికి చెందిన పుల్లలచెరువు రామాంజనేయులు దర్శి-కురిచేడు రహదారిలో కొండ దిగువ భాగం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా పొక్లెయిన్‌తో తవ్వి టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నాడు. కొండ వద్ద నుంచి అక్రమంగా మట్టి తరలింపును ఆపాలని కోరుతూ తహశీల్దార్ వెంకటేశ్వర్లుకు గ్రామస్తులు శ్రీనివాసరెడ్డి, అన్నెం యోగిరెడ్డి, ఇరుగుల వీరారెడ్డి, ఇరుగుల వెంకటేశ్వర్లు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. అక్రమంగా మట్టి తరలింపు నిలుపుదల చేయాలని కోరారు. స్పందించిన తహశీల్దార్ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# 17న గుండ్లకమ్మ ఆయకట్టు రైతుల ధర్నా

## ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు

**ప్రజాశక్తి-మద్దిపాడు**

గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లకు మరమ్మతులు చేయాలని, కాలువల్లో పూడికలు తీసి నీళ్లు చివరి భూములకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 17న కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న ధర్నాను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు కోరారు. మండల కేంద్రమైన మద్దిపాడులో రైతులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ గత ఏడాది సెప్టెంబర్‌లో గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు దెబ్బతిన్నట్లు తెలిపారు. దీంతో నీరు వృథా బయటకు వెళ్లిపోతున్నా ఇప్పటి వరకూ మరమ్మతులు చేపట్టలేదన్నారు. గేట్లకు మరమ్మతులు చేయాలని ఎపి రైతు సంఘం ఆందోళన చేయడంతో మంత్రులు, ప్రజా ప్రతినిధులు ప్రాజెక్టును పరిశీలించి మరమ్మతులు చేస్తామని హామీ ఇచ్చారే తప్పా దాన్ని గురించి పట్టించుకోలేదని మండి పడ్డారు. ఇప్పటికీ నీరు వృథాగా .పోతనూనే ఉందన్నారు. ప్రాజెక్టు నిరు పయోగంగా ఉంచడం బాధాకరమన్నారు. 12 టిఎంసిల నీటిని ఉపయోగించుకుని 80 వేల ఎకరాలు సాగు చేయవచ్చునని తెలిపారు.నీరు కిందకు వెళ్తుండటంతో సాగు ప్రశ్నార్థకం అవుతుందన్నారు. ప్రాజెక్టు రెండు వైపుల కాలువలు కూడా పూర్తిగా జమ్ము, చిల్లచెట్లతో నిండి ఉన్నాయన్నారు. 200 క్యూసెక్కుల నీళ పారాల్సి ఉండగా 100 క్యూసెక్కులు కూడా పోవడం లేదన్నారు. కాలువ చివరి భూములకు నీరు చేరడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల రైతు సంఘం నాయకులు కనపర్తి సుబ్బారావు, నాయకులు వెంకట్రామిరెడ్డి, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పమిడి వెంకటరావు

# జిజిహెచ్‌కి స్టేషనరీ అందజేత

**ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్**

ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు ప్రవాస భారతీయులు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మజ్జిగ శ్రీహర్ష గురువారం స్టేషనరీ సామగ్రిని అందజేశారు. అమెరికాలో స్టాఫ్‌వేర్ కంపెనీలో పనిచేస్తూ జిల్లాకు వచ్చిన మజ్జిగ శ్రీ హర్ష జిజిహెచ్‌లో సౌకర్యాలు, వివిధ విభాగాలను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఒంగోలులో ఇలాటి ఆసుపత్రి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్న విషయం తెలియదని, కోవిడ్ సమయంలో చేసిన సేవల నేపథ్యంలో ఆసుపత్రిని సందర్శించటానికి వచ్చానన్నారు. ఈ సందర్భంగా శ్రీహర్ష జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.భగవాన్ నాయక్, అర్‌ఎంఒ డాక్టర్ చైతన్య వర్మను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి అవసరమైన స్టేషనరీ సామగ్రిని ఆయన అందించారు. అమెరికాలో సాయంత్రం 5 తరువాత సాధారణ వైద్య సేవలు అందుబాటులో వుండవని, ఎమర్జెన్సీ సేవలు మాత్రమే అందుబాటులో ఉంటాయన్నారు. ఇక్కడ 24 గంటలు వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు. ఐసియు, ఎన్‌ఐసియు, ఎంఆర్‌ఐ, సిటీ స్కాన్ వంటి సేవలు కార్పొరేట్ ఆసుపత్రి స్థాయిలో వున్నాయని తెలిపారు. భవిష్యత్తులో జిజిహెచ్‌కు సహాయ సహకారాలు అందిస్తాని తెలియజేశారు. జిజిహెచ్ కి స్టేషనరీ అందించి, భవిష్యత్తులో అవసరమైన సాయం అందించేందుకు ముందుకొచ్చిన మజ్జి శ్రీహర్షను జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.భగవాన్ నాయక్, అర్‌ఎంఒ డాక్టర్ చైతన్య వర్మ అభినందించారు.



శ్రీహర్షను అభినందిస్తున్న డాక్టర్ భగవాన్ నాయక్, డాక్టర్ చైతన్య వర్మ

# సైకో ముఖ్యమంత్రిని సాగనంపాలి

## మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి

**ప్రజాశక్తి-హనుమంతునిపాడు**

సైకో ముఖ్యమంత్రి నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని టిడిపి కనిగిరి నియోజకవర్గం ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని దొడ్డి చింతల గ్రామ సర్పంచి సానికొమ్ము బ్రహ్మారెడ్డి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన150 కుటుంబాల వారు వైసిపిని వీడి గురువారం టిడిపిలో చేరారు. వారికి ఉగ్ర నరసింహారెడ్డి కండువాలు కప్పి పార్టీకిలో ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం అన్నీ వర్గాలను నట్టేట ముంచినట్లు తెలిపారు.టిడిపిలో చేరిన వారిలో కోటపాటి రమేష్‌రెడ్డి, మాజీ సర్పంచి గుమ్మా నాగూర్‌యాదవ్, వార్డు మెంబర్లు కొడమల నరసమ్మ, యారవ వెంకటరెడ్డి, గాయం స్వర్ణ, వైస్‌ప్రెసిడెంట్ ఏప్రాయం, గోన సౌలు, శ్రీనివాసరెడ్డి, తిరుపతయ్య, మునపాటి నారాయణయాదవ్, నల్లగొళ్ల లక్ష్మయ్య యాదవ్, పధకమూరి వెంకటేశ్వర్లు, సండ్రారి వెంకటేశ్వర్లు, బత్తుల కొండయ్య, వెంకటనారాయణ, మండల టిడిపి అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి ఉన్నారు.ఈ కార్యక్రమంలో కనిగిరి పట్టణ టిడిపి అధ్యక్షులు తమ్మినేని శ్రీనివాస్‌రెడ్డి, వెలిగండ్ల మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, యద్దనపూడి సాల్మన్‌రాజ్, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు ఫిరోజ్, నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షుడు బలసాని కోటయ్య, ఐటిడిపి రాష్ట్ర నాయకులు బ్రహ్మ గౌడ్, క్లస్టర్ ఇన్‌ఛార్జి దొడ్డ వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

# పాదయాత్రను జయప్రదం చేయాలి : సత్య

**ప్రజాశక్తి-పొన్నలూరు**

వైసిపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ రాష్ట్ర ప్రజలకు భరోసా కల్పిస్తూ టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రను విజయవంతం చేయాలని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ దామచర్ల సత్య కోరారు. కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలాశ్రీ బాలవీరాంజనేయ స్వామి, టిడిపి నాయకులతో కలిసి నారా లోకేష్ పాదయాత్ర నిర్వహించే రోడ్డును సత్య శుక్రవారం పరిశీలించారు. అనంతరం దామచర్ల సత్య మాట్లాడుతూ భవిష్యత్తు తరాలు బాగుపడాలంటే టిడిపి అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆదివారం సాయంత్రం మండల పరిధిలోని మాలపాడు గ్రామంలోకి యువగళం పాద యాత్ర ప్రవేశించనున్నట్లు ఆయన తెలిపారు. సోమవారం తిమ్మపాలెం, అంకిరెడ్డి పాలెం, చెరుకుంపాలెం గ్రామాల్లో పాదయాత్ర సాగు తుందన్నారు. 18న కె.అగ్రహారం గ్రామంలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే స్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, ఉపాధ్యక్షులు తానికొండ మహేంద్రచౌదరి, కోటిరెడ్డి, దాసరి కష్ణారావు, పిల్లి కష్టారెడ్డి, చిన్నప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే స్వామి, దామచర్ల సత్య

**వెలిగండ్ల :** టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌బాబు చేపట్టిన యువగళం పాదయాత్ర జయప్రదం చేయాలని తెలుగు యువత అధ్యక్షుడు కర్నాటి భాస్కర్‌రెడ్డి కోరారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. యువగళం పాదయాత్ర 18న కనిగిరికి చేరుకున్నట్లు తెలిపారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని పాదయాత్రను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి కారంపూడి వెంకటేశ్వర్లు, తెలుగు రైతు మండల అధ్యక్షుడు మీనిగ కాశయ్య, పోకల పుల్లారెడ్డి, యూత్ నాయకులు తాల్లూరి మాల్యాద్రి, కేలం చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వెలిగండ్లలో మాట్లాడుతున్న కర్నాటి భాస్కర్‌రెడ్డి

# ఉత్పత్తిదారుల సంఘాలతో ప్రయోజనం

**ప్రజాశక్తి-పొదిలి**

రైతు ఉత్పత్తి దారుల సంఘాల ఏర్పాటు చేసుకోవడం ద్వారా అనేక ప్రయోజనాలు కలుగుతాయని ఆత్మ పీడీ మరియు జిల్లా వనరుల కేంద్రం ఇన్‌ఛార్జి కె. అన్నపూర్ణ తెలిపారు. మండల పరిధిలోని పాములపాడు, మాదాలవారి పాలెం గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలలో రైతు ఉత్పత్తి సంఘ సభ్యులు, రైతులకు ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగులో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ మాట్లాడుతూ విత్తన ఎంపిక, విత్తన శుద్ధి, పురుగులు, తెగుళ్ళ, మందుల పిచికారీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఎఒ వి. వెంకటశేషమ్మ, పొదిలి ఎఒ జైనులాబ్దిన్, ఉద్యానవనశాఖ అధికారి సంధ్య, దర్శి ఎడిఎ బాలాజీ నాయక్ పాములపాడు సర్పంచి పేరం సుబ్బులు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పేరం చెంచిరెడ్డి, వైసిపి నాయకులు పేరం కోదండ రామిరెడ్డి, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు